


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 16-11-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 42 సంచిక : 57 పేజీలు : 8 వెల : 1 రూపాయి




### వర్చువల్, డిజిటల్ తరగతుల ద్వారా

# నాణ్యమైన విద్య

- విశాఖను ఐ-హబ్‌గా తీర్చిదిద్దుతా
- విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందించాలి
- భవిష్యత్తులో విద్యారంగంలో ఊహించని మార్పులు
- జిల్లా కలెక్టర్లు గ్రామాలలో మౌలికవసతుల కల్పన పరిశీలించాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

విశాఖపట్నంః విద్యాపరంగా విశాఖను ఐ-హబ్‌గా (మేధావంతమైన కేంద్రంగా) తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గురువారం స్థానిక నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యలో ఒత్తిడి పెరిగిందని, కాబట్టి విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందించాల్సిన అవసరం ఉందన్నారు. పుస్తకాల భారం పెరిగిందని, క్రీడలతో పాటు ఉల్లాసవంతమైన విద్యాబోధన అందించాల్సిన అవసరం ఉందన్నారు. దైనందిన కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు ఆటల ద్వారా విద్యను నేర్చుకోవాలని చెప్పారు. జీవితంలో నాయకత్వ లక్షణాలు, సమన్వయం కలిగి ఉండాలన్నారు. భవిష్యత్తులో విద్యారంగంలో ఊహించని మార్పులు వస్తాయని పేర్కొన్నారు. వాటి ద్వారా సంతోషం జీవన ప్రమాణాలు పెరుగుదలకు దోహదపడ తాయని, నూతన ఆలోచన విధానాలు పెంపొందు తాయన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా సంస్థలకు చెందిన మేథావులతో భావితరాలకు అర్థవంతమైన, విద్యాబోధన అందేలా చర్యలు చేపడతామన్నారు. వర్చువల్, డిజిటల్ తరగతులను నిర్వహించడం ద్వారా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా సాంకేతిక నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. విద్యార్థులకు యానిమేషన్, డిజిటల్ శిక్షణ అందిస్తామని చెప్పారు. గత నాలుగేళ్లలో 17 శాతం పురోగతి సాధించామన్నారు. వ్యవసాయం,

తరువాయి 2లో..

## కాశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో భూభాగమే



న్యూఢిల్లీ : పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిదీ ఇటీవల చేసిన వ్యాఖ్యలను కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమర్థించారు. అఫ్రిదీ సరిగ్గానే మాట్లాడారని తెలిపారు. వాళ్ళ పాకిస్థాన్‌నే నిభాయించలేకపోతున్నారన్నారు. అలాంటపుడు కశ్మీరును ఏ విధంగా నిభాయించగలరని ప్రశ్నించారు. కశ్మీరు భారత దేశంలో భాగమని, అలాగే కొనసాగుతుందని చెప్పారు. షాహిద్ అఫ్రిది ఇటీవల బ్రిటన్ పార్లమెంటు వద్ద విద్యార్థులతో మాట్లాడుతూ కశ్మీరుపై సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కశ్మీరు తమకు అక్కర్లేదని, పాకిస్థాన్‌లో ఇప్పుడు ఉన్న నాలుగు ప్రావిన్స్‌లను ఆ దేశం నిభాయించుకోలేకపోతోందని అన్నారు. కశ్మీరును భారతదేశానికి కూడా ఇవ్వొద్దన్నారు. కశ్మీరుకు స్వాతంత్ర్యం రావాలన్నారు. మానవత్వం సజీవంగా ఉండాలని ఆకాంక్షించారు. అమాయకులు మరణించకూడదని చెప్పారు. ప్రజలు మరణించడం బాధాకరమని తెలిపారు. ఏ మతానికి చెందినవారు మరణించినా బాధాకరమేనని తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే నేనొచ్చా



### బాబు పాలనను తుదముట్టించండి

### రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు

### 298వ రోజు ప్రారంభమైన ప్రజాసంకల్పయాత్ర

పార్వతీపురం: రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్న చంద్రబాబు పాలనను తుదముట్టించేందుకు, ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి నేనున్నానంటూ భరోసానిచ్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర విజయనగరం జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గంలో విజయవంతంగా కొనసాగుతోంది. జననేత

తరువాయి 2లో..

## టిడిపి అభ్యర్థిగా సుహాసినికి లైన్ క్లియర్

### కూకట్‌పల్లి టిడిపి అభ్యర్థిగా ఖరారు



హైదరాబాద్: కూకట్‌పల్లి అభ్యర్థిగా నందమూరి హరికృష్ణ కుమార్తె నందమూరి సుహాసిని పేరు దాదాపుగా ఖరారైంది. సీఎం చంద్రబాబును ఆమె విశాఖలో కలిశారు. కూకట్‌పల్లి టికెట్‌పై ఆమె చంద్రబాబుతో చర్చించారు. సుహాసినికే కూకట్‌పల్లి టికెట్ ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలుస్తోంది. కూకట్‌పల్లికి చెందిన స్థానిక నేతలతో చంద్రబాబు సమావేశం నిర్వహిస్తారని ప్రచారం జరుగుతోంది. మహాకూటమిలో భాగంగా కూకట్‌పల్లి స్థానాన్ని టీడీపీకి కేటాయించారు. అయితే టీడీపీ నుంచి మాజీ మంత్రి పెద్దిరెడ్డి, కూకట్‌పల్లి కార్పొరేటర్ మందాడి శ్రీనివాస్ ఆఖరి నిమిషం వరకు ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ సుహాసినికే టికెట్ ఇవ్వాలని చంద్రబాబు భావించినట్లు తెలుస్తోంది. కూకట్‌పల్లి టికెట్ ఆశించిన వారితో గురువారం సాయంత్రం చంద్రబాబు సమావేశం కానున్నారు. ఎన్టీఆర్ కుటుంబానికి టికెట్ ఇస్తుండటంతో అందరూ మద్దతు ఇవ్వాలని ఆయన కోరనున్నారు. హరికృష్ణ మృతి తర్వాత ఎన్టీఆర్ కుటుంబం నుంచి ఒకరికి అవకాశం కల్పించాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ తర్వాత

తరువాయి 2లో..

## ఖాళీగా ఉన్నప్పుడే పవన్ విమర్శిస్తారు

- అధికార పార్టీ డైరెక్షన్‌లో పవన్ నడుస్తున్నారు
- ప్రజా సమస్యలపై పోరాడాలి
- వైఎస్సార్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ



హైదరాబాద్ : కులాలతో సంబంధం లేదంటూనే జనసేన అధినేత పవన్ కల్యాణ్ కులాల గురించి మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. గురువారం ఆయన మీడితో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ అర్థం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌ను ఎదిరించానని గొప్పలు చెప్పుకుంటున్న పవన్.. అప్పుడు రాజకీయాల్లో ఉన్నారా అని ప్రశ్నించారు. చంద్రబాబులాగే పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. (అప్పటివరకూ పవన్ హాలీడేస్‌లో ఉన్నారా) ఖాళీగా ఉన్నప్పుడే

తరువాయి 2లో..

## ప్రత్యేక రోజుల్లో శబరిమలకు మహిళా భక్తులు?

### అఖిలపక్ష సమావేశంలో సీఎం విజయన్ ప్రతిపాదన



తిరువునంతపురం: శబరిమలను 10 నుంచి 50ఏళ్ల వయస్సు గల మహిళలు ప్రత్యేక రోజుల్లో దర్శించుకునేలా ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. ఈ విధానాన్ని అమలు చేసే అవకాశం ఉందా లేదా అన్నదానిపై ఆలయ ప్రధాన పూజారి, పందలం ప్రతినిధులతో చర్చిస్తామన్నారు. శబరిమల వివాదంపై చర్చించేందుకు గురువారం కేరళలో అఖిల పక్ష సమావేశం జరిగింది. సమావేశం అనంతరం సీఎం విజయన్ మీడియాతో మాట్లాడారు. ఇవే విషయాలను తాను అఖిలపక్ష సమావేశంలోనూ

తరువాయి 2లో..




## హోప్ ఐలాండ్ రక్షణకు పోరాడాలి



- మెలోడి థియేటర్ ఓనర్ సీ పోర్టు యజమానైపోయాడు
- కె.వి.ఆర్ దోపిడీకి చరమగీతం పాడాలి
- పోర్టు దోపిడీకి ప్రభుత్వ పెద్దలు వత్తాసు
- మరుగుదొడ్డికి పన్ను సిగ్గు చేటు
- ప్రతిపక్షనేత రోడ్డుపైన... ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలా!?
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్

కాకినాడః తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కేంద్రం కాకినాడ సముద్రంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన హోప్ ఐలాండ్‌రక్షణకు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు. కాకినాడలోని జి కన్వెన్షన్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ పోర్టు దోపిడి పైన, హోప్ ఐలాండ్ కోత పైన ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ పోర్టు నుంచి బియ్యం, ఆయిల్ అక్రమ రవాణా జరుగుతుందని, దానిపై కనీసం ప్రభుత్వం గాని , ప్రతిపక్షం గాని మాట్లాడక పోవడం విచారకరమన్నారు. ప్రజా సంక్షేమాన్ని, మత్స్యకారుల జీవనాన్ని ముప్పుతెచ్చే కాకినాడ పోర్ట్‌ను ప్రైవేటు వ్యక్తుల పరం చేసిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గాని, ఇప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. విశాఖపట్టణానికి చెందిన ఒకప్పటి మెలోడి సినిమా థియోటర్ యజమాని కెవిఆర్ సీపోర్టులో అక్రమ నిర్మాణాలు, వ్యాపారాలు చేస్తూ వేల కోట్లు అక్రమ సంపాదన ఆర్జించాడన్నారు. కెవిఆర్ గత బ్రతుకు తనకు తెలుసని ఇప్పుడు అమెరికాలో నివసిస్తూ దొంగచాటున భారతదేశానికి వచ్చి పోతున్నాడన్నారు. ఇతని అవినీతిపై

తరువాయి 2లో..

# ఏపీఈపీడీసీఎల్‌కు మూడు జాతీయ అవార్డులు




విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) సిగలో మరో మూడు జాతీయ అవార్డులు చేరాయి. జాతీయ స్థాయిలో ఏపీఈపీడీసీఎల్ రెండవ స్థానంలో గ్రీన్ గ్రిడ్ అవార్డును అందుకుంది. అలాగే విద్యుత్ రంగంలో పనితీరు మెరుగుదల అంశంలో ఏపీఈపీడీసీఎల్, ఏపీయస్‌పీడీసీఎల్‌లు కలిపి సంయుక్తంగా జాతీయస్థాయిలో మొదటిస్థానంలో నిలిచాయి. అంతేకాకుండా ఏపీఈపీడీసీఎల్ ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్ అవార్డు ఓవరాల్ విన్నర్‌గా నిలిచింది.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఈనెల 13 నుంచి 14వతేదీ వరకు రెండు రోజుల పాటు క్లీన్ ఎనర్జీ ఇన్ ఎవెరి హోమ్ అనే అంశంపై 12వ భారత ఇంధన సదస్సు-2018 జరిగింది. ఈ సదస్సులో భాగంగా ఇంధన రంగంలో వివిధ అంశాల్లో విశేష ప్రతిభ కనబరచిన సంస్థలకు అవార్డులను ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్.వై.దొర తరపున చీఫ్ జనరల్ మేనేజర్ వి.విజయ లలిత ఛాంబర్ ఆఫ్ కామర్స్ జ్యూరీ ప్యానెల్ సభ్యుల చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా సిఎండి హెచ్.వై.దొర మాట్లాడుతూ కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ, రాష్ట్ర ఇంధన శాఖల ఆదేశాలకు అనుగుణంగా డిస్కమ్‌లో పలు రకాల పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సంస్థ ఉద్యోగుల సమిష్టి కృషి కారణంగానే సంస్థకు జాతీయ స్థాయిలో అవార్డులు లభించాయన్నారు. ఈ అవార్డుల స్ఫూర్తితో వినియోగదారులకు మెరుగైన సేవలందించి ఏపీఈపీడీసీఎల్‌ను మరింత అభివృద్ధి పథకంలో పయనింప జేసేందుకు కృషి చేస్తామన్నారు. జాతీయస్థాయిలో డిస్కమ్ అవార్డులు లభించడం పట్ల సంస్థ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

# కొమిర గ్రామంలో గ్రామదర్శిని



గొలుగొండ : కొమిర గ్రామంలో గురువారం గ్రామదర్శిని కార్యక్రమం జరిగింది. అధికారుల బృందం ముందుగా గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని, రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. గ్రామంలో నిర్మాణం జరుగుతున్న చెత్త నుండి సంపద తయారీ కేంద్ర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్పీడిఒ సువర్ణరాజు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి గ్రామదర్శిని సరైన వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో...

తహశీల్దార్ అంబేద్కర్, ఇరిగేషన్ జెఇ రామన్నపాత్రుడు, వెలుగు ఏపి యం రమణకుమారి, వ్యవసాయ అధికారి మధుసూదన రావు, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ శ్రీనివాస్, ఈఒపిఆర్‌డి త్రిమూర్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ ఇన్‌ఛార్జ్ గా కదిరి జగన్నాథం

భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ ఇన్ ఛార్జ్ గా నియమితులైన కదిరి జగన్నాథం ను భీమిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ కోరాడ.లక్ష్మణ్ కుమార్ అభినందించి ఆయనకి నియమకపత్రం అందజేసారు.ఈ సందర్భంగా కదిరి జగన్నాథం మాట్లాడుతూ ఈ బాధ్యతలు నాకు అప్పగించినందుకు , ఎఐసిసి సెక్రటరీ క్రిస్టోఫర్ తిలక్,కి పిసిసి అధ్యక్షులు రఘువీరా రెడ్డి కి భీమిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ కోరాడ.లక్ష్మణ్ కుమార్ లు ఈ బాధ్యతలు అప్పగించి నందుకు నాకు ఆనందంగా ఉందని ఈ బాద్యతను సక్రమంగా నిర్వర్తిస్థానని అన్నారు. ఈ పదవికి నా పేరు ప్రోపోజ్ చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# డిసెంబర్‌లో ఆదర్శ పోలీసు స్టేషన్లు

పాణ్యం : పాణ్యంలో రూ.1.40 కోట్లతో నిర్మిస్తున్న ఆదర్శ పోలీసు స్టేషన్‌ను డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభించ నున్నట్లు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప అన్నారు. పాణ్యంలో నిర్మాణంలో ఉన్న ఆదర్శ పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్ తనిఖీ చేసి దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు ప్రజలకు, వాహనదారులకు, డ్రైవర్లకు అవగాహన కార్య క్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. తాంద్రపాడు వద్ద ఏర్పాటు చేస్తున్న కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్‌కు దూరంగా ఉన్న ప్రాంతాలకు మరో పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. రెవెన్యూ, అబ్కారి, ఇతర శాఖల అధికారులతో కలసి ప్రజాదర్బారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. దూరప్రాంతాల బందో బస్తుకు యువ పోలీసులను మాత్రమే పంపు తామని, ఆరోగ్య సమస్యలు, 55 సంవత్సరాలు దాటిన వారిని బందోబస్తుకు దూరంగా ఉంచుతామన్నారు. ఎన్నికలు దగ్గర పడు తుండటంతో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మాక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపడుతామన్నారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసే ప్రతి ఒక్కరికి రసీదు ఇవ్వాలని సిబ్బందికి స్పష్టం చేశారు. పాణ్యంలో కర్ణాటక పోలీసులు మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకోవడంపై వివరాలను సేకరిస్తామన్నారు. జిల్లాలో రెండు ఆదర్శ పోలీసుస్టేషన్లను అన్ని సౌకర్యాలతో నిర్మిస్తున్నామన్నారు. నంద్యాల డీఎస్పీ గోపాలకృష్ణ, సీఐ వాసుకృష్ణ, ఎస్సై జగదీశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



కొయ్యూరు : ఏజెన్సీ ప్రాంతాలను అభివృద్ధికి ప్రభుత్వం చేస్తుందని పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. గురువారం కొయ్యూరు మండలం బకులూరు గ్రామ పంచాయతీలో గ్రామదర్శి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఆమెతో పాటు అధికారుల బృందం పర్యటించారు. గిరిజనులతో మాట్లాడారు. అనంతరం జరిగిన గ్రామదర్శినితో ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఏజెన్సీలోని అన్ని మండలాల్లో శాశ్వత రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రతీ గిరిజన గ్రామాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొలిసింగి సత్యనారాయణ, ప్రత్యేకాధికారి, ఎంపిడిఒ రహమాన్, తహశీల్దార్ నైటింగేల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాయమాటలు నమ్మొద్దు, మిమ్మల్ని అన్ని విధాలా ఆదుకునేది టిడిపియే ...

## - ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఫేస్ 1 శంఖుస్థాపన చేసిన సి.ఎం. చంద్రబాబునాయుడు
## - చోడవరానికి 2,500 జి+3 ఇళ్లు మంజూరు



సుజల స్రవంతి పథకానికి శంఖుస్థాపన చేస్తున్న సి.ఎం., మంత్రులు



బహిరంగ సమావేశంలో మాట్లాడుతున్న సి.ఎం.

చోడవరం : మాయమాటలు నమ్మొద్దని, ప్రజల్ని అన్ని విధాలా ఆదుకునేది తెలుగుదేశం పార్టీయే అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలియజేసారు. రూ.2,200 కోట్లతో తలపెట్టిన పోలవరం లెఫ్ట్ కెనాల్, బాబూ జగజ్జీవనరామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఫేస్ 1 పథకానికి గురువారం చోడవరంలో సి.ఎం. చంద్రబాబు శంఖుస్థాపన చేసారు. అనంతరం చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో సి.ఎం. మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి పోలవరం ఎడమ కాల్వ ద్వారా ఉత్తరాంధ్రలో ఐదు నియోజకవర్గాల్లో 65,000 ఎకరాలకు సాగునీరు అందుతుందని, పవిత్ర గోదావరి జలాలతో రెండు పంటలు పండు తాయన్నారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా సుమారు 1,50,000 ఎకరాలకు సాగునీరం దుతుందని తెలియజేసారు. దేశంలో ఏ రాష్ట్రం లోనూ అమలు చేయని విధంగా రాజకీయాల కతీతంగా అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలియజేసారు. 90 లక్షల మంది తోబుట్టువులున్న డ్వాక్రా సంఘాలు తమ మానసపుత్రిక అని తెలిపారు. రూ.160 కోట్లతో మహిళా సంక్షేమానికి 'రక్ష' పథకాన్ని ప్రవేశపెట్టా మన్నారు. పేదరికాన్ని రూపుమాపేందుకు ఆహార భద్రత కల్పిస్తూ ప్రతీ ఒక్కరికి 5 కేజీల బియ్యం, పప్పు అందజేస్తున్నామన్నారు. పేదల పెళ్లిళ్లకు పెళ్లికానుక, నిరుద్యోగ భృతి, చంద్రన్న భీమా తదితర పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సుమారు 51 లక్షల మంది అర్హులైన వారికి 6 వేల కోట్లతో ఫించన్లు ఇస్తున్నట్లు తెలిపారు. నీటి ఎద్దడిని తట్టుకునేందుకు నదుల అనుసంధానం చేపట్టామన్నారు. దీని వలన ఒక ప్రాంతంలో నీరు లేకపోతే, మరొక ప్రాంతం నుండి తరలించడానికి వీలవుతుందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో 3.54 కె.ఎం. గ్రావిటీ ద్వారా రావికమతం మండలం పెదపూడి రిజర్వాయరుకు పోలవరం నీళ్లు సమృద్ధిగా అందుతాయన్నారు. 24వేల కోట్లు రైతు రుణమాఫీ చేసామన్నారు. విభజన హామీలను మరచిన కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తోందని తెలిపారుప్రతిపక్షనాయకుడు 'కోడికత్తి'తో రాజకీయాలు చేస్తే, మరో జనసేన నాయకుడు ఎం మాట్లాడు తున్నాడో ఆయనకే అర్థం కావటం లేదన్నారు. రాష్ట్రంలో ఈ యేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెల కొన్నాయని, పంట నష్టాలు అంచనా వేస్తామన్నారు. కరువు పరిస్థితులపై సమీక్ష చేస్తామని సి.ఎం. హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కోరిక మేరకు చోడవరం నియోజకవర్గానికి 2,500 జి+3 ఇళ్లు, గోకుటం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, రోడ్లు భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, ప్రాథమిక ఆరోగ్యం గిరిజన సంక్షేమ మంత్రి కిడారి శ్రావణ్, అనకాపల్లి ఎం.పి. అవంతి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పీలా గోవింద, పంచకర్ల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## వర్చువల్, డిజిటల్ తరగతుల ద్వారా నాణ్యమైన విద్య

ఉద్యానవనం, అక్వాకల్చర్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా 3 శాతం వ్యవసాయ పురోగతి సాధిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 17.7 శాతం సాధించామని అన్నారు. జిల్లా కలెక్టర్లు జిల్లా కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామాలకు వెళ్లి అక్కడ కలుగజేస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించి మెరుగుపరచాలి ఆదేశించామన్నారు. 2019 టెక్ సదస్సు నాటికి అత్యుత్తమ ఫలితాలను సాధిస్తామన్నారు. టెక్నాలజీలో మనం ఎంత అభివృద్ధిని సాధిస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా మన దేశ ప్రజలే అత్యధిక ఇంగ్లీషు మాట్లాడుతూ అన్ని రంగాలలో అగ్రస్థానంలో ఉన్నారన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో గత నాలుగేళ్లలో మంచి అభివృద్ధి సాధించామని చెప్పారు. 2016లో 29 శాతం, 2017లో 16 శాతం, ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ 18 శాతం వ్యవసాయాభివృద్ధి సాధించామని స్పష్టం చేశారు. నదుల అనుసంధానం ద్వారా భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈరోజుల్లో అనంతపురం జిల్లాలో అత్యధికంగా వ్యవసాయం సాగు జరుగుతోందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామన్నారు. పరిపాలనా విభాగాన్ని తక్కువ వ్యయంతో శీతలీకరణ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

### ప్రెస్‌కు ప్రత్యేక టౌన్‌షిప్

అమరావతిలో పాత్రికేయులకు రెండు వేల గృహాలు నిర్మిస్తున్నామన్నారు. వచ్చే నెలలో విశాఖపట్నంలో పాత్రికేయ టౌన్‌షిప్ నిర్మాణాలకు శంఖుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పారిశ్రామికాభివృద్ధిని ప్రధాన మంత్రి చేస్తున్న విదేశీ పర్యటనలలో ప్రస్తావిస్తున్నారని దానికి మన ఆంధ్రప్రజలు గర్వించాల్సిన విషయమన్నారు.

ఈ సమావేశంలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, యునెస్కో డైరెక్టర్ ప్రొఫెసర్ డా. అనంతదురయప్ప, ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి ఆదిత్యనాథ దాస్, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే నేనొచ్చా

298వ రోజు పాదయాత్రను గురువారం ఉదయం పార్వతీపురం నియోజకర్గంలోని చిన్నరాయుడుపేట నుంచి ప్రారంభించారు. అక్కడి నుంచి నిడగల్లు క్రాస్, మరిపివలస మీదుగా సూరమ్మ పేట వరకు పాదయాత్ర కొనసాగనుంది.

వైఎస్ జగన్ రాకతో పాదయాత్ర సాగుతున్న మార్గంలో పండుగ వాతారణం నెలకొంది. ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న ఆ సంకల్ప సూరీడు తమ ప్రాంతానికి రానున్నాడనీ.. తమ జీవితాల్లోకి వెలుగులు తెచ్చేందుకు పాటుపడుతున్నాడనీ.. ఆయనతో తమ గోడు చెప్పుకుని గుండెల్లోని వేదన దింపుకోవచ్చునని జనం ఆరాట పడుతున్నారు. జననేత తమ ప్రాంతానికి ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూస్తున్నారు.

## హోప్ ఐలాండ్ రక్షణకు పోరాడాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ప్రతిపక్షనేత జగన్ మౌనంగా ఉంటే కెవిఆర్‌తో భాగస్వామ్యం ఉన్నట్టేనన్నారు. ప్రజాసమస్యలు పట్టకుండా ప్రతిపక్షనేత జగన్ రోడ్డుపైన ,సీఎం విదేశా యాత్రలు చేస్తున్నారన్నారు. షిప్పింగ్ హార్బర్‌ను ద్వంసం చేస్తున్న కెవిఆర్ బాగోతాన్ని పోర్ట్‌లో జరుగుతున్న అవినీతిపై బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అమెరికాకు తన ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తే సీపోర్టును కాపాడుతానన్నారు. పర్యావరణ భక్షకుడిగా వ్యవహరిస్తున్న కె వి.రావును ప్రజలముందు నిలబడుతానన్నారు. ఎస్ సి జెడ్‌ను కాపాడేందుకు ఉద్యమిస్తామన్నారు.హోప్ ఐలాండ్‌లో 8వ బెర్తు నిర్మాణానికి ప్రతిపాదనలు జరుగుతున్నాయని ఈ బెర్తు నిర్మాణం జరిగితే మత్స్య సంపదకు ప్రసిద్ధిగాంచిన కాకినాడలో మత్స్య సంపద దొరకదని దీని వలన అనేక మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి శాశ్వతంగా కోల్పోతారన్నారు. కావున హోప్ ఐలాండ్‌ను ,ప్రకృతిని కాపాడేందుకు ముందు ఉంటామన్నారు. హోప్ ఐలాండ్‌లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కాకినాడ నడిబొడ్డున ఉన్న ఏటిమొగ ప్రాంతంలో మత్స్యకారులు పడుతున్న పాట్లను లఘుచిత్రం రూపొందించామన్నారు. సుమారు 500 మంది కుటుంబ సభ్యులు ఉన్న ఆ ప్రాంతంలో ఒకే ఒక మరుగుదొడ్డి ఉండటాన్ని చూసి చలించిపోయానన్నారు. ఒకసారి ముఖ్యమంత్రి తనయుడు రాష్ట్ర మంత్రి వస్తే వారి పరిస్థితులు చూపించడం జరుగుతుందని పవన్ అన్నారు. చంద్రబాబు నాయుడు తాను మరుగుదొడ్లు నిర్మిస్తున్నానని రోడ్లు వేస్తున్నానని ప్రగల్భాలు పలకడం తప్ప ఇటువంటి జుగుప్సాకరమైన అనారోగ్యకరమైన వాతావరణాన్ని పట్టించుకోవడంలేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. సమావేశంలో జనసేన నాయకుడు నాదేండ్ల మనోహర్ ,ముత్తా గోపాలకృష్ణ ప్రజలు పాల్గొన్నారు.

## టిడిపి అభ్యర్థిగా సుహాసినికి లైన్ క్లియర్

తెలంగాణ ప్రాంతం నుంచి పోటీ చేసే రెండో అభ్యర్థి సుహాసిని కావడం గమనార్హం. మొదటగా హరికృష్ణ కుమారుడు కళ్యాణ్‌రాంను కూకట్‌పల్లి నుంచి పోటీకి దింపాలని టీడీపీ భావించింది. ఆయన ఆసక్తి కనబర్చకపోవడంతో సుహాసినిని రంగంలోకి దింపాలని ఆ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. కూకట్‌పల్లి నియోజవర్గంలో అత్యధికంగా సెటిలర్స్ ఉన్నారు. ఇక్కడ వీరి ఓట్లే కీలకం. సెటిలర్లు ఏ పార్టీపై మొగ్గుచూపుతారో ఆపార్టీకి విజయావకాశాలు ఎక్కువ. అంతేకాకుండా ఎన్టీఆర్ అభిమానులు కూడా ఈ ప్రాంతంలో అత్యధికంగా ఉన్నారు. అందువల్ల సుహాసిని విజయం నల్లేరు మీద నడక అవుతుందని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి.

## ఖాళీగా ఉన్నప్పుడే పవన్ విమర్శిస్తారు

వచ్చి విమర్శలు చేయడం కాదు ప్రజల తరపున పోరాడాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతుంటే తమ నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పోరాడారు.. అలాంటి కార్యక్రమం పవన్ చేశారా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌పై హత్యాయత్న విషయంలో పవన్ చంద్రబాబులాగే మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ డైరెక్షన్‌లో పవన్ నడుస్తున్నారని ఆరోపించారు.

***బాబూ..ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఇప్పుడు గుర్తొచ్చిందా!?***

మహానేత వైఎస్సార్ మురణం తర్వాత ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని ఎవరూ పట్టించుకోలేదని బొత్స ఆరోపించారు. నాలుగున్నరేళ్ల తర్వాత చంద్రబాబు నాయుడుకి ఇప్పుడు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. వైఎస్సార్ హయంలో శంకుస్థాపన చేసిన సుజల స్రవంతి ఇంతవరకూ పూర్తిచేయలేదని విమర్శించారు. వైఎస్సార్ హయంలో 95శాతం పూర్తయిన తోటపల్లి ప్రాజెక్టును ఇప్పటి వరకూ 5శాతం కూడా చంద్రబాబు పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు.

పెండింగ్ ప్రాజెక్టులను 17వేల కోట్ల రూపాయాలతో పూర్తి చేస్తామన్న చంద్రబాబు.. ఇప్పుడు రూ. 52 వేల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని మండిపడ్డారు. మూడు రెట్లు అధికంగా ఖర్చు చేసినా ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సుజల స్రవంతి ప్రాజెక్టుని పూర్తి చేస్తామని బోత్స హామీ ఇచ్చారు.

## ప్రత్యేక రోజుల్లో శబరిమలకు మహిళా భక్తులు?

స్పష్టం చేశానన్నారు. భాజపా, కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్నప్పటికీ సుప్రీంకోర్టు తీర్పును తాము అమలు చేస్తామన్నారు. ప్రజల నమ్మకాల కన్నా వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఆందోళనకారులు ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలి అని ఆయన కోరారు. ప్రభుత్వం ఎటువంటి పక్షపాతం చూపటంలేదని, కేవలం అత్యున్నత న్యాయస్థానం తీర్పును మాత్రమే అమలు చేస్తోందన్నారు. భక్తులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఎల్లప్పుడూ వారికి భద్రత కల్పిస్తుందని విజయన్ హామీ ఇచ్చారు.

***కాంగ్రెస్ వాకౌట్..***

కాగా.. శబరిమల అంశంపై నేడు ప్రభుత్వం చేపట్టిన అఖిలపక్ష సమావేశం నుంచి కాంగ్రెస్ వాకౌట్ చేసింది. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోవట్లేదని, ఇది భక్తులకు సవాల్‌గా మారుతోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. శబరిమలలో శాంతి నెలకొల్పేందుకు వచ్చిన ఓ సువర్ణావకాశాన్ని సీఎం వృథా చేశారని వారు దుయ్యబట్టారు. అటు భాజపా కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. ప్రభుత్వం శబరిమలను రణరంగంగా మార్చాలని చూస్తోందని భాజపా నేతలు ఆరోపించారు. ఈ వ్యవహారంలో పోలీసులు స్వతంత్రంగా వ్యవహరించి సంప్రదాయాలను పరిరక్షించాలని భాజపా నేతలు కోరడం గమనార్హం.

# చైతన్య లోపం.. విజృంభిస్తున్న 'డెంగీ' భూతం

బ్రహ్మపుర : ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ చేసిన డ్రమ్ములు, బకెట్‌లను వారానికోసారి బోర్లించి శుభ్రపర చాలని, ఇళ్లల్లో దోమ తెరలు వినియోగించాలని ఆరోగ్యశాఖ అధికారులు ఎంత ప్రచారం చేస్తున్నా, ప్రజల్లో ఇంకా మార్పు రావడం లేదు. దీంతో గంజాం జిల్లాలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. దిగపాహండి సమితిలోని బొమకెయికు చెందిన ఓ వ్యక్తితోపాటు కుకుడా ఖండి సమితిలోని రొహిగావ్‌లో ప్లస్‌టు విద్యార్థి డెంగీ వ్యాధి బారినపడ్డాడు. జిల్లాలో ఈ ఏడాది జూన్ నుంచి ఇంతవరకూ మొత్తం 142 మంది వ్యాధి బారిన పడ్డారని జిల్లా మలేరియా విభాగం అధికారులు చెప్పారు.

# అధిక ఫీజులు నియంత్రించాలి

## మౌలిక వసతుల కల్పనపై మంత్రి గంటాకు వినతిపత్రం సమర్పణ



పెదవాల్తేరుః తల్లిదండ్రులు వేలకు వేలు ఫీజులతో తమ పిల్లలను ఉన్నతమైన చదువులు చదివించాలని ప్రయత్నిస్తుంటారు. అయితే ఆ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేకపోతే ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. దీనిపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి శ్రీనివాస రావు లాసన్స్ బే కాలనీలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. గురువారం ఎంవిపి దరి మంత్రి నివాసంలో పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి పి. వి. ఎల్. నారాయణ పాల్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ ఒకే విధంగా కాకుండా వివిధ రకమైనటువంటి ఫీజులు వసూలు చేస్తున్నారని దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని ఆందోళన వ్యక్తం చేశారు ఐఐటీ, సి.ఓ, నాసా పేరిట తల్లిదండ్రులు నుండి అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వీటిని సత్వరమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు ఆలస్యంగా చెల్లించిన వారిని కొట్టడం మరియు తోటి విద్యార్థుల ముందు అవమానంగా మాట్లాడి చులకన చేయడం, పరీక్షలు రాయకుండా ఆంక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దీనిపై విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చర్యలు తీసుకోవాలని లేదంటే కళాశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

అనంతగిరిః అనంతగిరి, అరకులోయ మాజీ శాసనసభ్యుడు దివంగత సీవేరి సోమా కుమారుడు సీవేరి అబ్రహాంనకు రాష్ట్ర యస్సీ, యస్టీ సభ్యునిగా అవకాశం కల్పించినందుకు మరియు అరకు లోయ శాసనసభ్యులు స్వర్గీయ కిడారి సర్వేశ్వరరావు కుమారుడు శ్రావణ్ కుమార్‌కు మంత్రి పదవి ఇచ్చినందుకుగాను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వీరిరువురు గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు. అనంతగిరి మండలంలో కొన్ని గ్రామాల్లో త్రాగునీరు రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుచున్నారని, త్రాగునీరు రహదారులు మంజూరు చేయాలని ఆమె మంత్రిని కోరుచున్నారు.

# విశాఖను కరువు జిల్లాగా ప్రకటించాలి

- వర్షాభావ పరిస్థితులతో నీరు అడుగంటింది
- పశుగ్రాసం నీరులేక పూర్తిగా ఎండిపోయింది
- సీపీఎం ఆధ్వర్యంలో రైతుల ధర్నా
- మోకాళ్లతో నిరసన తెలియజేస్తున్న రైతులు, నాయకులు



నర్సీపట్నంః విశాఖ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఆందోళనలో భాగంగా నడిరోడ్డుపై మోకాళ్లతో కూర్చొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతు, కౌలు రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వలన ప్రాజెక్టులు అడుగంటాయన్నారు. వరి పొలాలు పూర్తిగా ఎండిపోయి పశు గ్రాసానికి కూడా ఉపయోగపడని పరిస్థితి నెలకొందన్నారు. కావున వెంటనే కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. ఈ సంవత్సరం పంటలపై రైతులు తీసుకున్న అప్పులను వెంటనే మాఫీ చేయాలన్నారు.

నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని, రైతు, కౌలు రతులు, వ్యవసాయ కార్మికులకు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 1,02,060 హెక్టార్లకు 98.582 హెక్టార్లలో సాగైందని అధికారులు తెలిపారన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 29 మండలాల్లో 14,900 హెక్టార్లలో వరి ఎండిపోయిందని ప్రాధమిక అంచనా, పొట్ట దశలో చేను నేలచూపులు చూపడంతో వరి పంటకు పెట్టిన పెట్టుబడి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు.

నష్టపోయిన రైతులకు పంటలకు పరిహారం ఇవ్వాలన్నారు. జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టి వలసలు నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సత్తిబాబు, నాయకులు ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

# వై.ఎస్.ఆర్.సీపీ ఉత్తరలో భారీ చేరికలు



గురుద్వార్ : జి వి ఎమ్ సి 13వ వార్డుకు చెందిన పలువురు నాయకులు గురువారం వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలో చేరారు. 13వ వార్డు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో విశాఖ ఉత్తర నియోజక వర్గ సమన్వయకర్త కె.కె.రాజు సమక్షంలో వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి కె. కె. రాజు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సెక్రటరీ బి.గోవింద్, బి.సి.సెల్ నాయకులు వి.అప్పారావు మరియు పి.మహేష్, పి.సంధ్యా రాణి, బి.శ్రీను పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీవిద్య హరిప్రసాద్ కళాశాలలో నెహ్రు జయంతి

నర్సీపట్నంః నర్సీపట్నంలో ప్రముఖ కళాశాల అయిన శ్రీవిద్య హరిప్రసాద్ కళాశాలలో నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని, మాజీ ప్రధానమంత్రి జవహర్‌నెహ్రు జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించిన సందర్భంగా గురువారం విజేతలకు బహుమతులు అందజేశారు.

అంతేకాకుండా 20 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామజోగారావు ఆధ్వర్యంలో విద్యా ర్థులకు బహుమతులు, పుస్తకాలు, మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జోగారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత విలువలతో కష్టపడి మంచి స్థాయికి ఎదగాలన్నారు.

నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్‌కు ఆసరాగా నిలిచి ప్రతిభావంతులు అవుతున్నారన్నారు. అనంతరం నెహ్రూ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. రమణ, ఉమా మహేష్, నూకరాజు, నరేష్ నాయుడు, అబ్దుల్, గణేష్, సరస్వతి, సందీప్, శివప్రసాద్ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ధ్యేయం



నాతవరంః గ్రామాల అభివృద్దే ధ్యేయమని నాతవరం జెడ్పీటీసీ కరక సత్యనారాయణ అన్నారు. ఁ ́ ం ౦ ́ ం ఎ ా ౦ ́ ౦ చి న గొ లం గొ ం డ ే ప ట లో గ్రామదర్శిని జరిగింది. ముందుగా గ్రామంలో పర్యటించి అంగన్వాడీ కేంద్రం, రేషన్ దుకాణం, పాఠశాలను సందర్శించారు, ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను గ్రామదర్శిని ద్వారా తెలియజేయాలన్నారు. దీని ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్థాయి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# నేడు విశాఖలో స.హ. చట్టంపై ప్రజావేదిక

## జిల్లా అధ్యక్షుడు జక్కు నరసింహమూర్తి

గొలుగొండః సమాచార హక్కు చట్టం అమల్లో అధికారుల పాత్ర అనే అంశంపై ఈ నెల 16న 9 గంటలకు విశాఖపట్నంలో ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని, ఈ ప్రజావేదికకు జిల్లాలో ఐక్యవేదిక సభ్యులతో పాటు సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారులు, మేధావులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని ప్రచార ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు జక్కు నరసింహమూర్తి కోరారు.

గురువారం ఆయన మాట్లాడుతూ యుఎఫ్ఐ చక్రధర్ ఆధ్వర్యంలో విశాఖపట్నం హ్యాప్పీ ఫంక్షన్‌లో హాలులో నిర్వహిస్తున్న ప్రజావేదికకు ముఖ్య అతిధులుగా అంజలి భరద్వాజ్(న్యూఢిల్లి), విశ్రాంత ఐఏఎస్ అధికారి విఎఎస్ శర్మ, గీతం లా యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎం. సత్యనారాయణ రావు హాజరవుతున్నారన్నారు.

ఈ ప్రజావేదికకు జిల్లాలో సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకొని ఇంత వరకు సమాచారం పొందకుండా ఉన్నటువంటి వారు వారి దరఖాస్తులతో సహా హాజరు కావాలని కోరారు.

జిల్లాలో సమాచార హక్కు చట్టంఅమల్లో పౌరులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల విధానంపై ఈ ప్రజావేదికలో చర్చించడం జరుగుతుందన్నారు.

పౌరుల యొక్క సమస్యలపై అంజలి భరద్వాజ్ వారికి స్పష్టంగా వివరిస్తారన్నారు. కావున జిల్లాలోని అన్ని మండలాల నుంచి దరఖాస్తుదారులతో పాటు మేధావులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

# అన్ని విధాలా వార్డుల అభివృద్ధి



నర్సీపట్నంః అన్ని విధాలుగా మున్సిపాలిటీలోని వార్డులను అభివృద్ధి చేస్తామని నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు అన్నారు. మున్సిపాలిటీలోని 24వ వార్డులో గురువారం గ్రామదర్శిని కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా వార్డులో పర్యటించి వార్డు ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# అటవీ నర్సరీలతో రైతులకు మేలు

రావికమతంః సామాజిక అడవులు, అటవీ వన నర్సరీల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు, వ్యవసాయ కళాశాల నైరా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం(కొండెంపూడి) ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాలనైరా విద్యార్థులు రావికమతంలోని వన నర్సరీలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నర్సరీలో ఔషదగుణాలుండే మందు జాతి మొక్కల పెంపకం, వివిధ జాతుల మొక్కల రకాలు, వాటి శాస్త్రీయ నామాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# తైక్వాండోలో రజత పతకాలు

యలమంచిలి రూరల్ః స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో యలమంచిలి క్రీడాకారులు రెండు రజత పతకాలు సాధించారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ విశాఖలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలో యలమంచిలి కొత్తపేట పాఠశాలకు చెందిన ఆర్.యశోద, బాలికొన్నత పాఠశాలకు చెందిన యు.జయశ్రీలు అండర్‌17 విభాగంలో రజత పతకాలు సాధించారు. విజేతలను కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఆర్‌వి.అప్పారావు, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అచ్చియ్యనాయుడు అభినందించారు.

## నవోదయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రోలుగుంటః జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2019-2020 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఇఒ కిరణ్మయి తెలిపారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

# పంపిణీకి సిద్దంగా అపరాల పంట

మాకవరపాలెంః వరి కోతల అనంతరం వేసే రబీ పంటలో వేసే పెసర, మినుములు, నువ్వుల విత్తనాలు పంపిణీకి సిద్దంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారిణి ఎ.హేమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు కిలోల పెసలు రూ.180, నాలుగు కిలోల మినుములు రూ.190, రెండు కిలోల నువ్వులు రూ.120లకు అమ్మకాలు చేపడుతున్నట్లు వివరించారు. ఆసక్తి గల రైతులు వీటిని పొందేందుకు శుక్రవారం నుంచి భూమి పాసు పుస్తకం, ఆధార్ కార్డు నకళ్లతో నేరుగా వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# 20న మండల సర్వసభ్య సమావేశం

కొయ్యూరుః ఈ నెల 20న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఎస్‌కె.రెహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు. సమావేశానికి ఎమ్మెల్యే ఈశ్వరి హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు.

# వర్సిటీ పరిశోధనలలో నాణ్యతకు ఎస్ఇఎమ్ దోహదం

## గీతం సిఎల్ఎస్ డైరక్టర్ ప్రొఫెసర్ ప్రసాదరావు



సాగర్‌నగర్ : విశ్వవిద్యాలయాలలో జరిగే పరిశోధనలలో నాణ్యతా ప్రమాణాలకు స్ట్రక్చరల్ ఈక్వేషన్ మోడలింగ్(ఎస్ఇఎమ్) వంటి గణాంక శాస్త్ర ఉపకరణాలు ప్రస్తుత కాలంలో విరివిగా ఉపయోగిస్తున్నారని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ లెర్నింగ్ అండ్ సస్టైనబిలిటీ డైరక్టర్ ఎస్ .ఎస్ ప్రసాదరావు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (జిఎస్ఐబి) గురువారం 15-11-2018న నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆయన ముఖ్య అతిధిగా హజరై ప్రారంభించారు. పరిశోధనల ద్వారానే విశ్వవిద్యాలయాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శాయి, డాక్టర్ రాధారఘురామ పాత్రుని, వర్క్‌షాప్ డైరక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొని ప్రసంగించారు.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హజరయ్యారు.

**టెక్నికల్ ఇంగ్లీషురైటింగ్ పై గీతం వర్క్‌షాప్**

ఐటి రంగంలో ఉద్యోగావకాశాలతో పాటు పరిశోధకులకు, విద్యార్థులకు ఉపయోగపడే టెక్నికల్ ఇంగ్లీషు రైటింగ్ పై గీతం స్కూల్ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ ఆధ్వర్యంలో డిసెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరక్టర్ డాక్టర్ బి.నళిని తెలిపారు. అత్యంత ఉపయోగకరంగా ఉండే ఈ వర్క్‌షాప్ లో నిపుణులు హజరై టెక్నికల్ ఇంగ్లీషు రైటింగ్‌లో మెలకవలను తెలయజేస్తారని పేర్కొన్నారు.ఆసక్తి గల వారు నవంబర్ 20వ తేదీలోగా గీతం సెంటర్ ఫర్ లాంగ్వేజెస్ ను 0891-2840317, మొబైల్ 9705748318ను సంప్రదించి ముందుగా పేర్లను నమోదు చేయంచుకోవాలని సూచించారు.

# దేవేందర్ గౌడ్ సంస్థలపై ఐటీ కన్ను

హైదరాబాద్ః తెలంగాణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దేవేందర్ గౌడ్‌కు చెందిన సంస్థలపై ఐటీ శాఖ మరోసారి దృష్టి సారించింది. ఇటీవల ఉత్తరాంధ్రలో ఆయనకు సంబంధించిన సంస్థల్లో ఇప్పటికే సోదాలు చేసిన ఐటీ అధికారులు.. దేవేందర్‌గౌడ్ కుమారులు ప్రమోటర్స్‌గా ఉన్న సంస్థల్లో గురువారం (నవంబరు 15) మరోసారి తనఖీలు చేపట్టారు. ముఖ్యంగా హైద్రాబాద్‌లోని రవి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రియల్ ఎస్టేట్ సంస్థ డీఎస్‌ఏ బిల్డర్స్ కన్‌స్ట్రక్షన్స్, శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలపై సోదాలు నిర్వహిస్తున్నారు. తనిఖీల్లో మొత్తం 20 బృందాలు పాల్గొంటున్నాయి.

రవి ఫుడ్స్‌లో దేవేందర్‌గౌడ్ ముగ్గురు కుమారులు ప్రమోటర్స్‌గా ఉన్నారు. రవి ఫుడ్స్ ప్రమోటర్స్‌గా ఉన్నవారే డీఎస్‌ఏ బిల్డర్స్ సంస్థకు కూడా ప్రమోటర్లుగా ఉన్నారు. రవి ఫుడ్స్ డైరెక్టర్లు రవీందర్ కుమార్ అగర్వాల్, రాజేంద్రకుమార్ అగర్వాల్, కేదర్నాథ్ అగర్వాల్ ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. శాంతాశ్రీరామ్ ఎండీ మడ్డి నర్సయ్య ఇంట్లో కూడ సోదాలు జరుగుతున్నాయి.

## జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ లో

# డీపీఆర్వోలకు నేరుగా దరఖాస్తులు..

- జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు - తొలివిడతగా ఐదువేల గృహాల మంజూరు
- అర్బన్ లో పింక్ కార్డుఉన్నా గృహం మంజూరు - ఏపీయూడబ్లూజే నాయకులకు
- రాష్ట్ర మంత్రి కాల్వ శ్రీనివాసులు హామీ.....

విజయవాడ: అవసరమైన మరిన్ని సడలింపులు చేసైనా జర్నలిస్టుల కు గృహ నిర్మాణ పథకాన్ని ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గురువారం ఉదయం విజయవాడ లోని మంత్రి క్యాంపు కార్యాలయం లో ఏపీయూడబ్లూజే ప్రతినిధుల బృందం ఈ విషయంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకెళ్లడం జరిగింది. దాంతో మంత్రి సానుకూలంగా స్పందించి ఆన్ లైన్లో సమస్యలు తలెత్తిన వారు తమ దరఖాస్తును నేరుగా డీపీఆర్వోలకు ఇచ్చే అవకాశం కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్ లేక జేసీ టు ఆధ్వర్యంలో హౌసింగ్ డీఎం, డీపీఆర్వోలు జర్నలిస్టుల తో కలిసి సమావేశాలు ఏర్పాటు చేసి పథకం అమలుపై చర్చించి అక్కడికక్కడే సమస్య పరిష్కరించే విధంగా ఆదేశాలిస్తామని చెప్పారు. గ్రామీణ విలేకరుల కు తొలివిడతగా ఐదువేల గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. వీటి కేటాయింపు కార్యక్రమాన్ని డిసెంబరులో ప్రారంభిస్తామన్నారు. రేషన్ కార్డులు లేని వారికి వాటిని ఇప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తామన్నారు. అర్బన్ జర్నలిస్టులకు పింక్ రేషన్ కార్డు ఉండి సాలీనా ఆరు లక్షల ఆదాయం మించని వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. వయస్సు, సర్వీసు సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధనలను పూర్తిగా తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఆన్‌లైన్ విధానంలో అనేక సాంకేతికత ఇబ్బందులు ఎదురౌతున్నందున దాని స్థానంలో ఒరిజనల్ దరఖాస్తులను పూర్తి చేసి అందజేసే సౌకర్యం కల్పించాలని, అక్రిడిటేషన్ కల్గిన ప్రతి ఒక్క జర్నలిస్టుకు హౌసింగ్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చినందున దానిని మాత్రమే ప్రాతిపదికగా తీసుకోవాలని, ఆధార్ కార్డు, అక్రిడిటేషన్ కార్డు మాత్రమే జర్నలిస్టులకు ప్రధాన ఆధారంగా పరిగణించాలని, కుల, ఆదాయ, వయస్సు, సర్వీసు ధృవీకరణ పత్రాలను మినహాయించాలని, రేషన్ కార్డు నిబంధనలు కూడా తొలగించాలని కోరుతూ రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల సమాచార శాఖామంత్రి కాల్వ శ్రీనివాసులకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

వీలైనంత త్వరగా వాటిని అమలుచేసే విధంగా మార్పులు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

మంత్రి కాల్వను కలిసిన వారిలో ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్లూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్ధన్, కృష్ణా అర్బన్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, కొండా రాజేశ్వరరావు, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు, ఫొటో జర్నలిస్టుల ప్రతినిధి టి. వి.రమణ, జి. రామారావు, పి. మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను
## సంపాదకీయం

### ప్రజాస్వామ్య విజయం

శ్రీలంకలో రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టించి ప్రధాని పీఠంపై బైఠాయించిన రాజపక్సే పట్ల పార్లమెంటు అవిశ్వాసాన్ని ప్రకటించడం నిరంకుశత్వంపై ప్రజాస్వామ్యం సాధించిన విజయంగా అభివర్ణించవచ్చు. న్యాయస్థానం, పార్లమెంటు ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో సఫలమయ్యాయి. పార్లమెంటులో మెజార్టీ కలిగి ఉన్న రణిల్ విక్రమసింఘేను దేశాధ్యక్షుడు సిరిసేన తొలిగించడమే కాకుండా ప్రతిపక్ష నేత అయిన రాజపక్సేను ఆ స్థానంలో నియమించడంతో శ్రీలంకలో సంక్షోభం తలెత్తింది. గతంలో రాజపక్సే దేశాధ్యక్షుడిగా ఉన్నప్పుడు సిరిసేన ఆయన సహచరుడిగానే ఉండేవారు. కానీ రాజపక్సే పరమ నియంతగా మారడంతో, సిరిసేన ప్రతిపక్ష నేత అయిన విక్రమసింఘేతో చేతులు కలిపారు. ఎన్నికలలో రాజపక్సేను ఓడించి, సిరిసేన అధ్య క్ష పదవి స్వీకరించగా, విక్రమసింఘే ప్రధాని పదవి పొందారు. రాజ్యాంగం ప్రకారం పార్లమెంటులో మెజార్టీ మద్దతు కలిగి ఉన్న ప్రధానిని తొలిగించే అధికారం దేశాధ్యక్షుడికి లేదు. కానీ ఇటీవల రాజపక్సేతో చేతులు కలిపిన సిరిసేన, ప్రధాని పదవి నుంచి విక్రమసింఘేను తొలిగించారు. రాజపక్సేకు ప్రధాని పదవి కట్టబెట్టారు. కానీ ఆయనకు మెజార్టీ సభ్యుల మద్దతు లేకపోవడంతో పార్లమెంటును కూడా రద్దు చేశారు. అయితే పార్లమెంటును రద్దు చేసేవరకు సిరిసేన మద్దతు తీసుకున్న రాజపక్సే, ఆ వెంటనే ఆయనకు మొండి చేయి చూపించి తాను ఒంటరిగా ఎన్నికలకు పోతున్నట్టు ప్రకటించారు. పైగా తన ముఠాలతో కండబలం ప్రదర్శించడం దీంతో బెదిరిపోయిన సిరిసేన అనుచరులు , ఇతర రాజకీయపక్షాలవారు పార్లమెంటులో రాజపక్సేకు వ్యతిరేకంగా నిలబడ్డారు. దీంతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం తప్పింది. న్యాయస్థానం కల్పించిన వెసులుబాటు, పార్లమెంటు సభ్యులు ప్రదర్శించిన విజ్ఞత మూలంగా శ్రీలంకలో మళ్ళా నిరంకుశం తలె త్తే ప్రమాదం తాత్కాలికంగా తొలిగిపోయింది. అయితే శ్రీలంకలో సంక్షోభం పూర్తిగా తొలిగిపోయిందా అనేది అనుమానమే. రాజపక్సే పార్లమెంటులో మెజారిటీ నిరూపించుకోలేక పోవడం వల్ల ప్రధాని పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారు. పార్లమెంటులో తనకు మెజార్టీ మద్దతు ఉందని, తనను తొలిగించడం రాజ్యాంగ విరుద్ధమని ఇంతకాలం రణిల్ విక్రమసింఘే చేసిన వాదన నెగ్గింది. తానే ఇం కా ప్రధానినని కూడా ఆయన వాదిస్తున్నారు. అయితే రాజపక్సేను తొలిగించినంత మాత్రాన యధావిధిగా రణిల్ విక్రమసింఘేకు ప్రధాని పదవి లభించినట్టు కాదనే వాదన ఉన్నది. దేశాధ్యక్షుడైన సిరిసేన మళ్ళా రణిల్ విక్రమసింఘే ను ప్రధాని పదవిలో నియమించవలసి ఉం టుందని కొందరు రాజ్యాంగ నిపుణులు అంటున్నారు. మొదటి దశలో రాజపక్సే పక్షం వహించిన సిరిసేన ఇప్పుడు ఆయనకు దూరం జరిగినప్పటికీ, గతంలో మాదిరిగా విక్రమసింఘేతో కలిసి నడుస్తారా అనేది తెలువదు. రాజపక్సే ఇప్పటికీ బలమైన శక్తిగా ఉన్నందున ఆయనను అధికారానికి దూరంగా పెట్టడానికి, తద్వారా దేశాన్ని నిరంకుశత్వం నుంచి కాపాడటానికి సిరిసేన, విక్రమసింఘే కలిసి ఉండటం తప్ప మరో మార్గం లేదు. ఈ ఇరువురు కలిసి ఉంటే, మిగతా చిన్న పార్టీలవారు, ప్రజాస్వామిక వాదులు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. రాజపక్సే పొంచి ఉన్నందువల్ల, దేశ పరిస్థితి దృష్ట్యా వీరు విజ్ఞతతో వ్యవహరిస్తే బాగుంటుంది. సిరిసేన, రాజపక్సే పైకి పాత్రధారులుగా కనిపిస్తున్నప్పటికీ, శ్రీలంకలో తలెత్తిన సంక్షోభం వెనుక చైనా హస్తం ఉందనేది బహిరంగ రహస్యం. రాజ్యాంగ కుట్ర ద్వారా విక్రమసింఘేను తొలిగించడానికి ముందు ప్రజాభిప్రాయం కూడగట్టే ప్రయత్నం జరిగింది. మొదట దేశాధ్యక్షు డు సిరిసేనను హతమార్చడానికి భారత్ కుట్ర జరిపినట్టు ప్రచారం జరిగింది. సిరిసేన స్వయంగా ఈ ఆరోపణలు చేశారు. ఆ తరువాత విక్రమసింఘేను తొలిగించి, రాజపక్సేను ప్రధానిగా నియమించారు. రాజపక్సే నియామకం పట్ల ఒక్క చైనా మాత్రమే వెంటనే హర్షం వ్యక్తం చేసింది. భారత్ మౌనం వహించింది. ప్రజాస్వామ్య విరుద్ధమైన ఘటనల పట్ల భారత్ విచారం చెందుతున్నప్పటికీ, బహిరంగంగా స్పందించలేదు. ఏమి మాట్లాడినా విదేశీ జోక్యం ఉందనే ప్రచారం సాగుతుందని భారత్ భావించి ఉంటుంది. ఇప్పటి వరకు పలు బడుగు దేశాలలో సైనిక నిరంకుశత్వాలను నెలకొల్పి మద్దతు ఇచ్చిన చరిత్ర అమెరికాకు ఉన్నది. ఇప్పుడు మాల్దీవులు, శ్రీలంక అనుభవాలను బట్టి చూస్తే చైనా కూడా ఇదే దారిలో నడుస్తున్నట్టు కనిపిస్తున్నది. మాల్దీవులలో చైనా మద్దతుతో ప్రజాస్వామ్యాన్ని కాలరాచిన యమీన్ ఇటీవలే ఎన్నికలలో ఓడిపోయాడు. అత్యంత నిరంకుశంగా పాలించిన రాజపక్సే దొడ్డిదారిన ప్రధాని పదవి చేపట్టాడు.

## వచ్చే ఐపీఎల్‌కి ఆసీస్ క్రికెటర్లు దూరం?

### దేశానికి తొలి ప్రాధాన్యత నివ్వాలన్న క్రికెట్ ఆస్ట్రేలియా




సిడ్నీ: వచ్చే ఏడాది ఐపీఎల్‌కు ఆస్ట్రేలియా క్రికెటర్లు దాదాపు అందుబాటులో లేనట్లే కనిపిస్తోంది. ఐపీఎల్-2019కి, ఇంగ్లాండ్‌లో జరగనున్న వన్డే ప్రపంచకప్‌కు మధ్య విరామ సమయం చాలా తక్కువగా ఉండటంతో ఐపీఎల్‌లో పాల్గొనే ఆసీస్ క్రికెటర్ల విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. దీనికిగానూ ముందుగా ఆసీస్ జట్టును గాడిలో పెట్టిన తర్వాతే మిగతా వాటి గురించి ఆలోచించాలని, క్రికెటర్లు దేశానికే తొలి ప్రాధాన్యమివ్వాలని బోర్డు అధికారులు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం అయితే వచ్చే ఏడాది ఐపీఎల్ మార్చి చివరి వారంలో ఆరంభమై, మే 19న ముగిసే అవకాశాలున్నాయి. మరోవైపు మే 30 నుంచి ఇంగ్లాండ్‌లో వన్డే ప్రపంచకప్ ఆరంభం కానుంది. ఇంత తక్కువ సమయంలో ప్రపంచకప్‌కు సన్నద్ధం కావడం కష్టం. ప్రపంచకప్‌కు ఎంపికైన 15మంది ఆసీస్ క్రికెటర్లు ఆ సమయంలో ఐపీఎల్‌లో ఆడుతుంటే అప్పటికప్పుడే టోర్నీనుంచి వైదొలిగి స్వదేశానికి పయనం కావాలని ఆదేశాలు జారీ చేసింది. దీనికితోడు ఐపీఎల్‌లో ఆడాలనుకునే ఆసీస్ క్రికెటర్లు ముందుగా సీఏ నుంచి అనుమతి తీసుకోవాలని.. ఈ క్రమంలో స్వదేశంలో జరిగే దేశవాళీ టోర్నీలో తమ బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించిన తర్వాతే ఐపీఎల్‌కు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. మరోవైపు మార్చి 15-29మధ్య ఆస్ట్రేలియా, పాకిస్థాన్‌తో వన్డే సిరీస్ ఉండే అవకాశం ఉందన్నారు. ఈ సిరీస్ ముగిసిన తర్వాతే సదరు ఆటగాళ్లను ఐపీఎల్‌కు అనుమతిస్తామని సీఏ పేర్కొంది. ఇన్ని కఠిన నిబంధనల నేపథ్యంలో ఆసీస్ క్రికెటర్లు వచ్చే ఏడాది ఐపీఎల్‌కు దూరం కావటం దాదాపు ఖాయమైనట్లే.

## లాభాలతో ముగిసిన స్టాక్‌మార్కెట్లు



ముంబయి: దేశీయ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, దేశీయ మార్కెట్లలోకి కొత్తగా విదేశీ పెట్టుబడులు రావడంతో మదుపర్లు కొనుగోళ్ల వైపు మొగ్గుచూపారు. దీంతో సూచీలు లాభాలను ఆర్జించాయి.

ఈ ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కొనుగోళ్ల అండతో లాభాల బాట పట్టాయి. ఒక దశలో 150 పాయింట్ల వరకు లాభపడిన సెన్సెక్స్ చివరకు 118 పాయింట్ల లాభంతో 35,260 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ నిఫ్టీ 40 పాయింట్లు లాభపడి 10,617 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 72.10గా కొనసాగుతోంది.

ఎన్ఎస్ఈలో అదానీ పోర్ట్స్, టైటాన్, ఐషర్ మోటార్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హీరో మోటార్స్ షేర్లు లాభపడగా.. గ్రాసిమ్, యస్ బ్యాంక్, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఎన్టీపీసీ, భారతీ ఇన్‌ఫ్రాటెల్ షేర్లు నష్టపోయాయి.

## గడ్డకట్టిన సిమ్లా

### అప్రమత్తంగా ఉండాలని కశ్మీర్, హిమాచల్‌కు కేంద్రం సూచన

సిమ్లా: ఉత్తరాదిని హిమపాతం వణికిస్తోంది. కొన్నిరోజులుగా మంచు కురుస్తూనే ఉంది. జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో దీని తీవ్రంగా ఉంది. ఎటు చూసినా అవని శ్వేత వర్ణపు చీర ధరించిందా అన్నట్లుగా పరిసరాలు దర్శనమిస్తున్నాయి. బుధవారం దీని తీవ్రత మరింతగా ఉండగా.. గురువారమూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. పర్యటక నగరాలైన సిమ్లా, నార్కందా, కుర్ఫీ, దాల్‌హౌజీ, ధర్మశాల, పాలమ్‌పూర్, మనాలీ నగరాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని.. కల్ప, చిట్‌కుల్, కిన్నౌర్, కీలాంగ్ నగరాల్లో భారీగా హిమపాతం ఉండొచ్చని పేర్కొంది.




హిమాచల్‌ప్రదేశ్‌లో కీలాంగ్ నగరం అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం. ప్రస్తుతం ఇక్కడ -1.9 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. కల్ప, మనాలీల్లో ఒకటి నుంచి 1.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. షిమ్లాలో రికార్డు స్థాయిలో 9.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందనట్లు వాతావరణ శాఖ తెలిపింది. విపరీతమైన మంచు నేపథ్యంలో జమ్ము కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, హిమపాతం అధికమైతే తక్షణం చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర హోంమత్రిత్వశాఖ రాష్ట్రాల అధికారులకు సూచించింది.

**కశ్మీర్‌లో ప్రమాద హెచ్చరికలు**

కశ్మీర్‌లో హిమపాతం అధికంగా ఉన్న ఏడు జిల్లాలో అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. బందిపొర, బారాముల్లా, అనంత్‌నాగ్, కుల్గాం, బుద్‌గామ్, కుప్వారా, గందర్‌బల్ జిల్లాల్లో మంచు అధికంగా కురుస్తుండడంతో ఇక్కడి ప్రజలను ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. కశ్మీర్ లోయలోని చాలా ప్రాంతాల్లో సోమవారం నుంచి ఎడతెరిపి లేకుండా మంచు కురుస్తుండటంతో కొన్ని రహదారులను మూసివేశారు. హిమపాతం కారణంగా చాలా ప్రాంతాల్లో ఆపిల్ తోటలు దెబ్బతిన్నాయి.

## కవి సమయం

### ఇది "తెలుసు"నా..!

తెలుసుకున్నంత మాత్రాన అన్నీ
చేయలేవు
తెలియకపోయినంత మాత్రాన
చేయకుండా ఆగలేవు
అంతా తెలిసి ఉండడం మంచిదే
కొన్ని తెలిసియుండకపోవడమూ
మంచిదే
అన్నీ తెలుసు అనే గర్వం వద్దు
ఏమీ తెలియని అజ్ఞానం వద్దు
తెలుసుకుంటే సరిపోదు
బహుళ సాధన చేయాలి
తెలియకపోయినా ఫరవాలేదు
మరలా అడిగి తెలుసుకో
ఎటు వెళ్లాలో తెలిస్తే మంచిది
ఎటు వెళ్లకూడదో తెలిస్తే మరీ
మంచిది
తెలుసుకున్న మంచి విషయాలు
జీవితాంతం గుర్తు పెట్టుకో
తెలుసుకున్న చెడ్డ విషయాలు వెంటనే
మర్చిపో
నిత్య సత్యాలు తెలుసుకోవడం
నీకుపకారం
ఆ సత్యాన్ని పదిమందితో
పంచుకోవడం పరోపకారం
తెలిసి తెలియదని నటించే వాళ్లూ
ఉన్నారు
తెలియకపోయినా తెలుసునని
భ్రమించే వాళ్లూ ఉన్నారు

\- పి. శాంతికుమార్

## పంచాంగం

మాసం : కార్తీక; తిథి : అష్టమి ఉ.6.47; ధనిష్ట ఉ.9.59; సా.వ.5.54ల 7.40. | శుక్రవారం 16-11-2018

a **మేషం** : మీ యత్నాలు కొంత ఆలస్యంగానైనా పరిపూర్ణంగా పూర్తవుతాయి. నూతన పెట్టుబడులు, వ్యాపారాలకు అనుకూలం. చేపట్టిన పనుల్లో శ్రమాధిక్యత, ప్రయాసలు ఎదుర్కొంటారు. అవివాహితులకు శుభవార్తలు అందుతాయి. ఉద్యోగస్తులకు రావలసిన ప్రమోషన్‌లో స్వల్ప ఆటంకాలు ఎదురువుతాయి. నిరుద్యోగులు, చేతి వృత్తుల వారికి ఆశాజనకం. b **వృషభం** : పండ్లు, పూలు, కొబ్బరి, చిరు వ్యాపారులకు లాభదాయకం. ఖర్చు పెరగటంతో రుణ యత్నాలు, చేబదుళ్ళు తప్పవు. విద్యార్థులకు ఒత్తిడి, మెలకువ ఆందోళన కలిగిస్తాయి. ఇతరులకు పెద్ద మొత్తాలలో ధన సహాయం చేసే విషయంలో లౌక్యం ఎంతో అవసరం. మిత్రుల ద్వారా అందిన ఒక సమాచారం మీకు ఆందోళన కలిగిస్తుంది. c **మిథునం**: ఉద్యోగస్తులకు ఒత్తిడి, పనిభారం అధికం. ఏజెన్సీ, నూతన కాంట్రాక్టుల విషయంలో పునరాలోచన అవసరం. రాజకీయ నాయకులు సభ, సమావేశాలలో చురుకుగా వ్యవహరిస్తారు. ఆత్మీయుల కలయిక సంతోషం కలిగిస్తుంది. వ్యాపారాభివృద్ధికై చేసే కృషిలో రాణిస్తారు. రావలసిన ధనం అందటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. d **కర్కాటకం** :ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. పారిశ్రామిక రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచివి కావని గమనించండి. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత అవసరం. e **సింహం** : నిరుద్యోగులు శుభవార్తలు వింటారు. పారిశ్రామిక రంగాల వారికి కార్మికులతో సత్సంబంధాలు నెలకొంటాయి. క్యాటరింగ్ పనివారలు, చేతివృత్తుల వారికి ఆశాజనకం. తరచూ వేడుకలు, శుభకార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్యంలో తగు జాగ్రత్తలు అవసరం. ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. విద్యార్థులలో ఏకాగ్రత, పట్టుదల అవసరం f **కన్య** : బంధువులతో తెగిపోయిన సంబంధాలు బలపడతాయి. మీ కార్యక్రమాలు, పనులు వాయిదా వేసుకోవలసి వస్తుంది. స్త్రీలతో మితంగా సంభాషించండి. గృహంలో ఒక శుభకార్యం సమర్థంగా నిర్వహిస్తారు. ఉన్నతస్థాయి ఉద్యోగస్తులకు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత అవసరం. కోర్టు వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. g **తుల** : కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లు, ప్లీడరు గుమాస్తాలకు ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపారాలకు కొత్త కొత్త పథకాలు, ప్రణాళికలు రూపొందిస్తారు. దంపతుల మధ్య పలు ఆలోచనలు చోటు చేసుకుంటాయి. రాబడికి మించిన ఖర్చులుంటాయి. ధనవ్యయంలో ఏకాగ్రత వహించండి. h **వృశ్చికం** : రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరుతుంది. స్త్రీలు గృహాలంకరణ, విలాస వస్తువుల పట్ల ఆసక్తి కనబరుస్తారు. తలపెట్టిన పనులు నిర్విఘ్నంగా పూర్తి కాగలవు. ఆస్తి వ్యవహారాలలో సోదరులతో ఒప్పందాలు కుదుర్చుకుంటారు. బంధువుల నుంచి ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో లౌక్యం అవసరం. i **ధనుస్సు** :హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. కొంతమంది మీ ఆలోచనలను నీరుగార్చేందుకు యత్నిస్తారు. లీజు, ఏజెన్సీలు, నూతన టెండర్లు అనుకూలిస్తాయి. శ్రమాధిక్యత, అకాల భోజనం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. ఉద్యోగస్తులకు తోటివారి నుంచి ఆహ్వానాలు అందుతాయి. ఏవైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తినా నెమ్మదిగా సమసిపోతాయి. j **మకరం** : మీలోని బలహీనతలను తొలగించుకోవటంపై దృష్టి పెడతారు. ఆర్థిక విషయాలలో పురోభివృద్ధి. బ్యాంకు రుణాలు అందుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. కొన్ని సందర్భాలలో రిస్క్ తీసుకోవాల్సి వచ్చినా చివరికి మంచే జరుగుతుంది. చివరికి విజయం మీ సొంతం. k **కుంభం** :విద్యార్థులు ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి. కోర్టు వ్యవహారాలు అనుకూలిస్తాయి. ప్రేమికులకు ఎడబాటు, ఊహించని చికాకులు ఎదుర్కోవలసి వస్తుంది. విదేశాల్లో ఉంటున్న ఆత్మీయుల క్షేమ సమాచారాలు సంతృప్తినిస్తాయి. అవివాహితులకు అనుకున్న సంబంధం కుదరడంతో ఉత్సాహంగా ఉంటారు. L **మీనం** : చేపట్టిన పనులు కొంత ఆలస్యంగానైనా అనుకున్న రీతిలో పూర్తి చేస్తారు. ప్రముఖులతో పరి చయాలు లాభిస్తాయి. వస్త్ర, బంగారం, ఫ్యాన్సీ, పచారీ వ్యాపారులకు పురోభివృద్ధి. తరచూ వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు.

# పరమేశ్వరుడు మంగళ స్వరూపుడు

## సంకీర్తన



ఆయన ఆదిదేవుడు.. ఆది మధ్యాంత రహితుడు... అడిగినవారికి, అడిగినంత ఇచ్చే బోళాశంకరుడు. తాను గరళాన్ని మింగి, లోకాలకు అమృతాన్నిచ్చిన మహోదారుడు శంకరుడు. తాను శ్మశానవాసిగా భిక్షాటన చేస్తూ, భక్తులకు సకలైశ్వరముల నిచ్చే భక్తజన సులభుడు పరమశివుడు.అసలు 'శివం' అంటేనే 'మంగళం' లేక ''కల్యాణం అని అర్థం. పరమేశ్వరుడు మంగళస్వరూపుడు.

**శివ - అంటే పరమేశ్వరుడు.**

శివా - అంటే పార్వతి. ఇలా అయ్యవారిలోనే అమ్మవారు ఉంది. 'శివపురాణం'లోని లింగోద్భవ కథ అందరికీ తెలిసిందే. శివుడు ప్రథమంగా లింగరూపిగా వెలసిన సందర్భం - హరిబ్రహ్మల వివాద సందర్భంలో ఆ రోజు ఒకానొక మాఘమాసంలో కృష్ణ చతుర్దశి రోజు. అర్ధరాత్రి వేళ! బ్రహ్మదేవుడు, విష్ణుమూర్తి తమ తమ గొప్పదనాలను గురించి వాదులాడు కుంటున్న సమయం. సృష్టిస్థితి, కారకులైన వాపరిద్దరూ అలా వాదులాడుకోవడం, వారిపై ఆవరించి యున్న 'మాయ'కు సంకేతం. ఆ మాయను తొలగించేందుకు 'మాయి' అయిన మహేశ్వరుడు పూనుకోక తప్పలేదు. పరస్పర ఆధిక్యతను నిరూపించుకునేందుకు బ్రహ్మాస్త్ర వైష్ణవాస్త్రాలు విజృంభించినప్పుడు, ఆ ఇద్దరి నడుమన ఆదిశంకరుడు అఖండాగ్ని స్తంభంగా ఆవిర్భవించాడు. మాఘకృష్ణ చతుర్దశ్యామాది దేవో మహానిశి

శివలింగ తయోద్భూత: కోటి సూర్య సమప్రభ.

కోటి సూర్యలకు సమానమైన ప్రకాశంగల ఆ మహాలింగం ఆవిర్భావం జరిగిన రోజే మహాశివరాత్రి. ఆ మహాగ్ని స్తంభానికి ఆది, అంతం లేదు. ఆ లింగ స్వరూపం నిర్గుణ పరతత్త్వ స్వరూపం. ఆయన శుభాలనొసగేవాడు. లోక కల్యాణమూర్తి. తనను ప్రార్థించినవారికి కొంగు బంగారం. తనను ఎలా పూజించినా సరే, కేవలం 'భక్తి'కి మాత్రమే ప్రాధాన్యతనిచ్చే అభయంకరుడు శంకరుడు. ఆ మహేశ్వరుని విభూది ధరించని నుదురు, ఈశ్వరార్చన చేయని జన్మం, శివాలయ లేని గ్రామం, శివ సంబంధం లేని విద్య, అత్యంత నీచములు, నింద్యములని జాబాలోపనిషత్తు చెబుతోంది. అందుకే సాధారణంగా మన దేసంలో శివాలయం లేని ఊరుండదు. శివాలయం లేని ఊరు స్మశానంతో సమానం.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days విజయభాను క్లాసిఫైడ్స్ సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# మెగా ఎల్‌ఎల్‌ఆర్ మేళా

యలమంచిలి : యలమంచిలి పట్టణములో ఈ నెల 19వ తారీకు సోమవారం నాడు మెగా ఎల్ ఎల్ ఆర్ మేళా నిర్వహిస్తున్నట్లు యలమంచిలి పురపాలక సంఘం కమీషనర్ ఆర్ ప్రసాద్ రాజు గురువారం జరిగిన విలేకరుల సమావేశములో తెలిపారు. ఈ సమవేశములో కమిషనర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు లైసెన్స్‌ను కలిగి ఉండాలని డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపకూడదని అది చట్ట రీత్యా నేరమని అన్నారు. కావున సోమవారం స్థానిక గుర్రప్పా కల్యాణ మండపంలో జరిగే ఈ మేళాను యలమంచిలి పురప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## టెలిమెడిసిన్ విధానం వద్దు గ్రామాల్లోనె మందులు ఇవ్వండి...!

అనంతగిరి : ప్రభుత్వం పెట్టిన టెలిమెడిసిన్ విధానం వల్ల గిరిజన ప్రాంతం లో ఆయా గ్రామాల గిరిజనులు ఎన్నో సమస్యలు పడుతు అష్ట కష్టలు పడి ఎక్కడ సబ్ సెంటర్ ఉందో, ఎంతో దూరం నడచి వెల్లి మందులు తీసుకోవాలన్నా ఎంతో కష్టమని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.ఉదాహరణకి ఒక వ్యక్తికి ఆరోగ్య పరిస్తితి బాగలేదు అతని గ్రామానికి సబ్ సెంటర్ కి 10,నుండి 15 కిలో మీటర్లు నడచి వెల్లి మందులు తీసుకోవాలి అంటే ఎలా సాధ్యం అని అంటున్నారు.తెలుగుదేశం ప్రభుత్వం ఇంటింట వైద్యం అని చెప్పి టెలిమెడిసిన్ పెట్టడం ద్వార గిరిజనులకు వైద్యం కష్టతరమవుతుంది. తమ తమ గ్రామాల్లోనె వైద్య సిబ్బంది మందులు పంపిణీ చేయాలి అంటున్నారు. టెలిమెడిసిన్ ఉన్న సబ్ సెంటర్ వద్ద చిన్న, పాపలు, వృద్దులు, అంగవైకల్యం, అంధత్వం, గర్భిణులు ఎలా వెల్లి వైద్యం చేయించుకోగలుగుతారు అని పలువురు గిరిజనులకు ప్రశ్నార్థకంగా మిగిలిందని .ఆయా మండల గ్రామాల గిరిజనులు ఆవేదన పడుతున్నారు.కాబట్టీ టెలిమెడిసిన్ విధానం రద్దుచేసి పాత పద్దతిలోనె గ్రామ, గ్రామలకు వైద్య సిబ్బంది ద్వార మందులు పంపిణి చేసి గిరిజనుల ఆరోగ్యం కాపాడాల్సిన బాధ్యతా ప్రభుత్వందేనని పలువురు గిరిజనులు అంటున్నారు.

## మండల సూపరిండెంటెంట్ తీరుపై నాయకుల ఆగ్రహం

గొలుగొండ : మండల ఎంపిడిఒ కార్యాలయ సూపరిండెంట్ రవికుమార్ తీరుపై మండలంలోని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎంపిడిఒ సువర్ణరాజు ఉన్నప్పటికి సాడా ఎంపిడిఒగా సూపరిండెంటెంట్ రవికుమార్ వ్యవహరిస్తున్న విధానంతో పలువురు నాయకులు విమర్శిస్తున్నారు. మండలంలో ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ సమాచారం ఇవ్వడం లేదని వాపోతున్నారు. అంతా తానే, ఎంపిడిఒలా హంగామా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా చేసుకుంటే పోతే భవిష్యత్‌లో దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉందని, జాగ్రత్తగా ఉంటే మంచిదని మండల నాయకులు, ఎంపిటిసిలు హెచ్చరిస్తున్నారు.

### బి ఆర్ తాళ్ళవలస గ్రామంలో గ్రామ దర్శిని

భీమునిపట్నం : పద్మనాభం మండలం బి ఆర్ తాళ్ళవలస గ్రామంలో గ్రామ దర్శిని కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ విజయ్ బాబు పాల్గొన్నారు. అనంతరం అయినాడ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ షిర్డీ సాయిబాబా 31వ వార్షికోత్సవం సందర్భంగా సాయిబాబా దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల పార్టీ అధ్యక్షులు కాళ్ల నగేష్ , జడ్పీటీసీ దామోదర రావు, కురిమిన లీలావతి, తహశీల్దార్, ఎంపీడీవో, ఇతర శాఖల అధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బాలల వారోత్సవాల సందర్భంగా చిలకలగెడ్డ ఆశ్రమొన్నత పాఠశాలలో-నేచర్ కళాజాతర



అనంతగిరి : మండలంలో చిలకలాగెడ్డ ప్రభుత్వ ఆశ్రమోన్నాత పాఠశాల లో నేచర్ మరియు దిమ్సా పౌండేషన్ అద్వార్యములో గిరిచైతన్య సంస్థామరియు ప్రధానోపాధ్యాలు దాశరథి సహకారంతో పాఠశాల ఆవరణలో నేచర్ కళాబృందం కృష్ణబాబు,సంతోష్,అద్దు టీం ద్వారా బాలల వారోత్సవాలు పురస్కరించుకొని బాలల హక్కులు, చట్టాలపైన పోషకాహారం బాల్య వివహాల పైన బుధవారం రాత్రి 8గంటలవరకు మాటలు, పాటలు ఏక్షన్ల ద్వారా విద్యార్థులకు అవగాహన చేశారు.ఈసందర్భంగా ఎచ్ ఎం దాశరథి మాట్లాడుతూ నేచర్ కళాబృందానికి ధన్య వాదాలు తెలుపుతూ విద్యార్థులనుదేశించి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నతమైన చదువులు భ్యసించి గొప్పవారుగా అవ్వాలని అధికారులుగా చూడాలని ఆకాంక్షించారు కళాజాత ద్వారా చట్టాలు,హక్కులు,గూర్చి పాటల ద్వారా అవగాహన పరిచిఉన్న నేచర్ కళాకారులకు ధన్యవాదములు తెలిపారు కార్యక్రమంలో పాఠశాలఉపాధ్యాయులు, గిరిచైతన్య బృందం చంద్రరావు ఎస్ ఎం సి సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బొంగు చికెన్‌కి వ్యాపారం కరువైంది



అరకులోయ : అరకులోయ ప్రాంతం అంటే పర్యాటక ప్రాంతం అధిక సంక్యలో పర్యాటకులు దర్శించే ప్రాంతం ఇలాంటి ప్రాంతంలో వ్యాపారం బాగుంటుంది అను కున్నాము కానీ, వ్యాపారం లేక అమ్ముడు పోక చాల ఖాళీ గా ఉందని బొంగు చికెన్ వ్యాపార దారులు అంటున్నారు. రోజు ఎంతో కొంత వచే డబ్బులతో కుటుంబం పోషణా జరుగుతుంది అంటున్నారు. వ్యాపారం లేక కొన్ని సంధర్భంలో పస్తులు ఉన్న రోజులు ఉన్నాయి అని అంటున్నారు.ఈ ఏడాది పర్యాటకులు పెద్దగా లేక వ్యాపారం సాగటం లేదని బొంగు చికెన్ వ్యాపారస్తులు ఆవేదన పడుతున్నారు.

## 51వ గ్రంధాలయ వారోత్సవాలులో భాగంగా పుస్తక ప్రదర్శన ప్రారంభం



అచ్యుతాపురం : రెండవరోజు గురువారం 51వ గ్రంధాలయ వారోత్సవాలు సందర్భంగా అచ్యుతాపురం శాఖా గ్రంధాలయం నందు పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఎస్.చంద్రశేఖర్ రాజు ప్రారంభించారు. ఈ పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి అచ్యుతా స్కూల్ విద్యార్థినీ, విద్యార్ధులు మరియు ఇతర విద్యార్ధులు పాల్గొన్నారు. ఈ పుస్తక ప్రదర్శనకు ఉపన్యాసకులుగా లాలం గోపాలకృష్ణ విద్యార్ధులకు పుస్తకాలు చదువుకోవటం వలన ఉపయోగం, విజ్ఞానం గురించి వివరించారు. తదుపరి అచ్యుతా ఇంగ్లీష్‌మీడియం సైన్స్ టీచర్ సిహెచ్.కుమార్‌రాజా కూడా పుస్తక ప్రదర్శన యొక్క ఉపయోగములు, గ్రంధాలయాలు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి అని విద్యార్ధులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమానికి తోటి డిగ్రీ విద్యార్ధులు, రెడ్డి సత్తిబాబు మొదలగు వారు పాల్గొన్నారని గ్రంధాలయ అధికారి డి.కోటేశ్వరరావు వివరించారు.

## అభయాంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు, జడ్పీటీసీ పైలా



పరవాడ : యాభైఅరోవవార్డు లంకెలపాలెంలో గల అభయాంజనేయ స్వామి ఐదోవ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందులో బాగంగా గురువారము స్దానిక శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, పరవాడ జిల్లాప్రాదేశిక సభ్యులు పైల జగన్నాదరావు అమ్మవారిని దర్శించుకోని ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి రౌతు శ్రీనువాసురావు, పచ్చికోర రమణమూర్తి ,బొండా అప్పారావు మాష్టర్, మడకరమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న పెళ్లికానుక పంపిణీ

భీమునిపట్నం : భీమిలి డివిజన్ 15వ వార్డులో వివాహం చేసుకుంటున్న పొడుగు సాయి ప్రసన్న మరియు ఎర్రంశెట్టి హేమారావు దంపతులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి పెళ్లికుమార్తె వివాహ సమయంలో ఆర్థికంగా సహకారం అందించాలనే సంకల్పంతో చంద్రన్న పెళ్లికానుక క్రింద 40,000/- లు మంజూరు చేయడం అయింది. దీనికి సంబంధించిన బాండును భీమిలి తెలుగుదేశం పార్టీ అద్యక్షులు గంటా నూకరాజు మరియు చంద్రన్న కళ్యాణ మిత్ర చింతపల్లి ఎల్మాజి లు అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత పేదప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టారని అందులో చంద్రన్న భీమా, చంద్రన్న పెళ్లికానుక, నిరుద్యోగ భృతి వంటివి ఉన్నాయని, ఇంత మంచి పథకాలు ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనం ఎల్లవేళలా రుణపడి ఉండాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, పెంటపల్లి యోగీశ్వరావు, గిడుతూరి శ్రీనివాస రావు, మారోజు సంజీవకుమార్, వాడమొదలు సత్యారావు, గూడుపు రాజు, కనకల అప్పల నాయుడు, కృష్ణారావు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 20వతేదీన రాజమండ్రిలో 'జయహో బీసీ మహా సదస్సు'



విశాఖపట్నం : తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో జనవరి 20వతేదీన రాజమండ్రిలో జరగబోవు 'జయహో బీసీ సదస్సు' కోసం ఏపీ రాజధాని అమరావతిలో టీడీపీ రాష్ట్రస్థాయి బీసీ సంఘాల ముఖ్య నాయకులతో హ్యాపీ రిసార్ట్స్, గుంటూరులో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలుగుదేశం పార్టీ స్టేట్ జనరల్ సెక్రటరీ మరియు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి తొలి నుంచి బీసీలు అండగా వున్నారని, బీసీల రుణం తీర్చుకోవడానికే రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సదస్సుకు శ్రీకారం చుట్టారని అన్నారు. మహానాడు తరహాలోనే రెండురోజులు పాటు ఈ సదస్సు నిర్వహించే, తొలిరోజు అన్ని బీసీ కులాల వారితో సమావేశాలు జరిపి ఆ కులాల సమస్యలను తెలుసుకుంటారని అన్నారు. రెండోరోజు బహిరంగ సభ వుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్ ఛైర్మన్ కాకి గోవింద్‌రెడ్డి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పప్పు రాజారావు, రూరల్ జిల్లా టీడీపీ జనరల్ సెక్రటరీ బుద్ధ నాగ జగదీష్, బీసీ నాయకులు బి.రామారావు, పాసర్ల ప్రసాద్, కనిశెట్టి అప్పలనాయుడు, ముఖ్య బీసీ నాయకులు పాల్గొన్నారు.

## భీమిలి జూనియర్ కాలేజీకి ఆర్‌ఓ ప్లాంట్ వితరణ



భీమునిపట్నం : స్థానిక జూనియర్ కాలేజీ కి భీమిలి కి చెందిన కట్టమూరి కుటుంభ సభ్యులు సుమారు 80 వేలు విలువచేసే ఆర్ ఓ ప్లాంట్ ను అందజేసారు ఈ ప్లాంట్ ను భీమిలి ఎం.పి.పి.యరబాల క్రిష్ణవేణి అనీల్ ప్రసాద్ భీమిలి డివిజన్ టి.డి.పి.అద్య క్షులు గంటా .నూకరాజులు ప్రారంభించారు. అలాగే తగరపువ లస అంబేద్కర్ పాఠ శాల కు 80 వేలు విలువచేసే ఆర్ ఓ ప్లాంట్ ను అందజేశారు. అలాగే భీమిలి లో వున్న మున్సిపల్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్ధులకు సుమారు 260 కంచాలు గ్లాసులు అందజేసారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సి పల్ పి.ఉమారాణి , కట్టమూరి కుటుంభ సభ్యులు పోతన్నశెట్టి, స్వామీజీ, భీమిలి మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు,టి.డి.పి. నాయుకులు మైలపల్లి, షణ్ముఖరావు, నరశింగరావు,రమణ తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా ఆరిపాక సాయిబాబా ఆలయం ఆరవ వార్షికోత్సవం



బాబాను దర్శించుకున్న ఆలయ ధర్మకర్త కోటేశ్వరరావు

సబ్బవరం : మండలంలోని ఆరిపాక గ్రామం దరి చెరుకు కాటా వద్ద వేంచేసియున్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ ఆరవ వార్షికోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం ఉదయం 5 గంటల నుండి బాబాకి ప్రత్యేక పూజలు, పాలతో అభిషేకాలు ఆలయ అర్చకులు కొత్తపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణ, డప్పుల వైవిధ్యాల నడుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మళ్ల కోటేశ్వరరావు, శరగడం శంకర్‌రావు, చొక్కాకుల గోవింద, శరగడం రాము పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి బాబాను దర్శించుకున్నారు. అనంతరం ఈ వార్షికోత్సవంలో భాగంగా జిల్లాస్థాయి వాలీబాల్, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం బాబాకి హారతి మరియు బాబా దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఆలయ ధర్మకర్త మళ్ల కోటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా భక్తి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో తల్లిదండ్రులకు శిక్షణా కార్యక్రమం

భీమునిపట్నం : దివ్యంగుల సంయుక్త ప్రాంతీయ కేంద్రం సి.ఆర్.సి జాతీయ బుద్ధి మాంద్యుల దివ్యంగజన్ సాధకార సంస్థ నెల్లూరు మరియు సర్వశిక్షా అబియాన్ విశాఖ జిల్లా వారి సమన్వయం తో గురువారం తల్లిదండ్రులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం భవిత కేంద్రం లో జరిగింది.ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిథి ఎం.పి.పి.యరబాల క్రిష్ణవేణి మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం లో అన్ని అంశాలను తల్లి దండ్రులు శ్రద్దగా విని వాటిని ఆచరించడం ద్వారా దివ్యంగ పిల్లలు అభివృద్ధి చెందుతారని అన్నారు ఎం.ఇ.ఓ అమృత బాలమణి మాట్లాడుతూ దివ్యంగులకు తగు శిక్షణలు ఇవ్వడం వలన ఉన్నతంగా అభివృద్ధి చెందుతారని తెలియ జేసారు.జిల్లాసహిత విద్యా సమన్వయ కర్త ఎన్.శ్రీదెవి మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం ను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తెలుసుకున్న మేలుకువులు పిల్లల దైనందిత జీవితం లో వినియోగించి వారి పై ప్రత్యేక శ్రద్ద కనబరచి సర్వశిక్షా అబియాన్ కలిప్పించే సేవలు సదుపాయాలు పొందాలని అలాగే వారి అభివృద్ధికి కృషి చెయాలని తెలిపారు. నెల్లూరు సి.ఆర్ సి. కోఆర్డినేటర్ మరియు పునరావాస అదికారి డాక్టర్ ఎ.ఈశ్వరరావు మాట్లాడుతూ దివ్యంగులు అయిన ఎస్.సి., ఎస్.టి.విద్యార్దులకు 150 టి.ఎల్.ఎం.కిట్స్ ఇవ్వడం అయినదని వాటిలో భీమిలి మండలం కు ఏడు టి.ఎల్.ఎం.కిట్స్ ఇచ్చామని అన్నారు. ఇటువంటి పిల్లల పెంపకంపై వారి తల్లిదండ్రుల పాత్ర చాల కీలకమైనదని, ప్రతీ చిన్న విషయంలోనూ వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి నేర్పించ వలసి ఉంటుందని వివరించారు. ముఖ్యంగా వారికి బోధనలు అందించే విషయంలో ఓపికగా ఉంటూ.తగు జాగ్రత్తలు పాటించాలని, ఇంటి వద్ద ఫిజియో థెరపీ ఏవిధంగా చేయాలనే విషయాలను వివరించారు. ఈ సందర్భంగా బుద్ధిమాంద్య పిల్లల కొరకు ఉండే చట్టాలను, వాటిని ఉపయోగించుకునే విధానం, ప్రభుత్వ పధకాలపై అవగాహన కల్పించారు.డాక్టర్. రఘునాద్ ఫిజియో తెరిఫీ కార్యక్రమం నిర్వహించి మెలుకువలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా సహాయ సమన్వయ కర్త ఎస్ రామకృష్ణ ,భీమిలి, అనందపురం, పద్మనాభంమండలాలకు చెందిన వందమంది దివ్యాంగులు వారి తల్లి దండ్రులు మూడు మండలాల సహిత విద్యా ఉపాద్యాయులు ఐ.ఇ.ఆర్.టి.ఎస్. శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, అద్దంకి.కేజియా కుమారి,ఎస్.ఎస్. ఎస్.కుమారి లు పాల్గొన్నారు.

## గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన



నర్సీపట్నం : 51వ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో గురువారం పుస్తక ప్రద ర్శన జరిగింది. ఈ ప్రదర్శ నలో విద్యార్థులకు, నిరు ద్యోగులకు, వయోజను లకు, మహిళలకు సంబం ధించిన పుస్తకాలు ప్రదర్శిం చారు. గ్రూప్స్, సివిల్, బ్యాంక్, ఇంజనీరింగ్, మెడిసెన్, నేవీ, ఆర్మీ, రైల్వే, ఎస్సై, పోలీసు కానిస్టేబుల్, పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగు లకు సంబంధించి పుస్తకాలను ప్రదర్శించారు. ముఖ్య అతిధులుగా హైస్కూల్ హెచ్‌ఎం సాల్మన్‌రాజు, సహ ఉపాద్యాయులు సుబ్ర హ్మణ్యం, వరహాల బాబు, గ్రంధాలయాధికారి అట్టా నూకరాజు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### పోయినవి

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా 06-11-2018వతేదీన ఉదయం 8 గంటల సమయంలో 3 టౌన్ రైతుబజార్ ఏరియాలో బస్సు ప్రయాణంలో భీమునిపట్నం తహశీల్దార్ గారు జారీ చేసిన నివేసిన స్థలం 1) పట్టా నెం HSDR No 537/1405 Cdt 6-96 (RC NO 143/96 Cdt 6-96) సర్వే నెం 314P విస్తీర్ణం య 0.03 సెం. 2) పట్టా నెం HSDR NO 540/1905 Cdt 6-96 (RC NO 143/96 Cdt 6-96) సర్వే నెం 314P విస్తీర్ణం య 0.03 సెం చెందిన ఒరిజినల్ పట్టా కాగితాలు పోయినవి. కనుక లోకులు ఎవరికైనా సదరు భూమి పట్టాలు వీటికి సంబంధించిన దస్తావేజులు దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు తెలియచేసిన యెడల తగిన పారితోషకం ఇవ్వబడును.

**Rapeti Govind**
**S/o late R.Appala Naidu**
**Flat No.301, Aaram Apartment**
**Main Road, Chinna Waltair,**
**Near Syndicate Bank,**
**Visakhapatnam-17.**
**Contact : 9676671654**

# విరాళాలను లెక్కిస్తున్న కమిటీ సభ్యులు



యానాం: ఓల్డేజ్ హెూం 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రజలు, దాతలు ఇచ్చిన విరాళాలను కమిటీ సభ్యులు లెక్కించారు. బుధవారం ఉదయం స్థానిక ఓల్డేజ్ హెూంలో కార్యదర్శి పి. గంగయ్య ఆధ్వర్యంలో చెక్కులు, డిడి రూపంలో ఇచ్చిన విరాళాలను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లెక్కింపు మొదలుపెట్టారు. ఓల్డేజ్ హెూం వార్షికోత్సవ సందర్భంగా విరాళాలు ఇచ్చి ఆదోకోవాలని వ్యవస్థాపక అధ్యక్షులు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు పిలుపు మేరకు వార్షికోత్సవ వేడుకలలో ప్రజలు విరాళాలు అందచేయగా గురువారం స్థానిక ఓల్డేజ్ హెూంలో ప్రజలు తరలివచ్చి విరాళాలు అందచేశారు.

విరాళాలు ఇచ్చి ఆదుకున్న వారికి నేరుగా మెసేజ్‌లు, ఫోన్‌ల ద్వారా కృతజ్ఞతలు తెలపనున్నట్లు కార్యదర్శి పి.గంగయ్య తెలిపారు. ఈ విరాళాల లెక్కింపులో కమిటీ సభ్యులు ఎంఎ సిరాజ్దీన్, ఎం. సుబ్బారావు, ఎ. సుబ్బారాయుడు, ఎం. ఆనందరావు, పి. రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. విరాళాలు ఇవ్వదలచినవారు బ్యాంకుల ద్వారా డిడి తీసి తమ వివరాలు పొందుపరచాలని కమిటీ సభ్యులు కోరారు.

# బావిలోకి దూసుకుపోయిన ట్రాక్టర్

## ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు





పాయకరావుపేట : విశాఖజిల్లా ఎస్ రాయవరం మండలం గోకులపాడు సమీపంలో నేల బావిలోకి ట్రాక్టర్ దూసుకుపోయిన సంఘటనలో ఇద్దరు కూలీలు మృతిచెందగా, నలుగురికి గాయాలు అయ్యాయి. యస్. రాయవరం నుండి కొరుప్రోలువద్ద కొబ్బరితోటలో కొబ్బరి డొప్పలు లోడు చేయడానికి వెళుతుండగా గోకులపాడు వద్దకు వచ్చేసరికి ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇంజిన్‌కు ట్రక్‌కి గల సీల(జాయింట్ బోల్ట్) ఊడిపోయి ట్రక్ కొంతదూరం వచ్చి అదుపు తప్పి జాతీయ రహదారి16కి పక్కన ఉన్న పాడుబడ్డ నేల బావిలో సుమారు 30 అడుగులు లోతున ట్రక్ బోల్తా పడింది. ఈ సంఘటనలో యస్.రాయవరం మండలం కర్రివానిపాలెంకు చెందిన పినపాత్రుని సన్యాసిరావు (45), పుణ్య మంతుల అర్జున్(46) అనే ఇద్దరు కూలీలు అక్కడక్కడే ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి వీరిని నక్కపల్లి ఆసుపత్రికి తరలించారు. సంఘటన సమయంలో ట్రక్‌లో 6 మంది కూలీలుఉన్నారు. సంఘటన స్థలంలో విషాధచాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి స్థానికులు సహాయంతో బాడీలను క్షతగాత్రులను నక్కపల్లి ఆసుపత్రికి తరలించారు.

# ముఖ్యమంత్రి సభకు భారీగా తరలివెళ్లిన తెదేపా శ్రేణులు



మాకవరపాలెం ; విశాఖపట్నం జిల్లా చోడవరంలో గురువారం జరిగిన ఉత్తరాంధ్ర సుజల ప్రవంతి పథకానికి శంకుస్థాపన కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ మహెూన్నత కార్యక్రమానికి విచ్చేయుచున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపేందుకు మండలంలోని 25 గ్రామ పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు బస్సుల్లో వెళ్లారు. సుజల ప్రవంతి పథకం ద్వారా మాకవరపాలెం మండలంలోని సుమారు 20వేల ఎకరాలకు సాగునీరు అందనుందని మండల తెదేపా అధ్యక్షులు రుత్తల శేషుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల తెదేపా మహిళా అధ్యక్షురాలు రుత్తల రమణమ్మ, పాపయ్య పాలెం ఎంపీటీసీ వబ్బలరెడ్డి సుబ్బలక్ష్మి, రుత్తల వెంకటరమణ, లగుడు గోవింద, శ్రీనివాసరావు, వబ్బలరెడ్డి వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, టిడిపీ కలయిక అనైతికం – తిల్లపూడి

తాళ్లరేవు: ఆంధ్రప్రదేశ్‌ను రెండురాష్ట్రాలుగా విభజించి ప్రజల విశ్వాసాన్ని కొల్పోయిన కాంగ్రెస్ దానికి సహకరించిన టిడిపీ ప్రస్తుతం పొత్తుపెట్టుకోవడం అనైతికం అన్ని తాళ్లరేవు వైఎస్ఆర్ సిపి వాణిజ్య విభాగ కన్వీనర్ తిల్లపూడి నాగేశ్వరరావు ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మతత్వ బిజెపితో నాల్గు సంవత్సరాలు అంటకాగి రాష్ట్రాని అధోగతిపాలు చేసిన టిడిపీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి కొట్టుమిట్టడుతున్న తరుటణంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎదురు తిరగడంతో గత్యంతరం లేని పరిస్థితిలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని తెలంగాణాలో ఎన్నికలకు వెళ్ళడం ప్రజలను వంచించడమే అన్నారు. చంద్రబాబుకు చేసిన అభివృద్ధిపనులను ప్రజలకు చెప్పుకొని గెలవలేని దుస్థితికి చేరారని కాంగ్రెస్ ఓటు శాతం కలిస్తే గెలుస్తామన్మ ధీమాతో కాంగ్రెస్‌తో జత కలిశారని దీనిని ప్రజలు హర్షించరన్నారు. కేంద్ర నుండి వేలాది కోట్లు తీసుకువచ్చి అమరావతిలో తాత్కాలిక భవనాలు కట్టడం తప్ప ఆంధ్రప్రజలకు చేసింది ఏమీలేదని ఆరోపించారు. ప్రజలు జగన్‌ను విశ్వసిస్తున్నారని ఆయనకే పట్టం కడతారని ధీమా వ్యక్తంచేశారు.

# ఎక్సైజ్ దాడులు

పెద్దాపురం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో జరిగిన దాడులలో ఇదర్ని అరెస్టు చేసినట్లు సి.ఐ. నాగభూషణం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాలుతిమ్మాపురానికి చెందిన వాసంశెట్టి గంగ, పెద్దాపురానికి చెందిన మందాడ పార్వతిలను సారా విక్రయిస్తుండగ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దాడులలో 7 లీటర్ల సారాయి స్వాధీనం చేసుకొని ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు, జరిమానా విధించినట్లు నాగభూషణం తెలిపారు. ఈ దాడులలో ఎస్సైలు కృష్ణప్రసద్, ఎస్ . బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

# కార్మికులు సంఘటితంగా ఉండాలి

పెద్దాపురం: భవన నిర్మాణ రంగంలో అన్ని విభాగాల కార్మికులు సంఘటితంగా ఉండాలని పెద్దాపురం సహాయ కార్మిక శాఖాధికారి రఘుపతి సూచించారు. స్థానిక పాత ఆర్టీసీంత భవనంలో జరిగిన భవన నిర్మాణ రంగంలో గల అన్ని విభాగాల శిక్షణా తరగతుల వారిని ఉద్దేశించి మాట్లాడుతూవచ్చే సంవత్సరం నుండి కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయబడునని కావున కార్మికులంతా సమన్వయంతో శిక్షతులై జీవనోపాధి పొందాలని రఘుపతి కోరారు. ఈ సమావేశంలో నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రఘుపతిబాబు, దుర్గారావు, రాజు, ప్రసాద్, కృష్ణ, నాగమహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ శాంతి కాముకుడు నెహ్రూ

అమలాపురం,: భారత ప్రధమ ప్రధాని దివంగనేత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని స్థానిక "తెలుగు భారతి" సాహిత్య, సాంస్కృతిక సేవ సంస్థ జరుపుకుని మహానేతకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యత వహించిన సీనియర్ జర్నలిస్టు బి.యస్.రాజు మాట్లాడుతూ దేశ స్వాతంత్రరంగంలో కాకుండా, రాజకీయాల జోలికి వెళ్ళకుండా వుండిఉంటే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గొప్ప రచయిత, సామాజిక వేత్తగా ప్రంపంచ ప్రఖ్యాతి పొందేవారని పలువురు దేశనాయకులు పలికిన పలుకులను గుర్తు చేసి అంజలి ఘటించారు. ప్రపంచ శాంతికోసం అన్నికోణాలలో దేశాధినేతగా శాంతి సమరదూతగా ప్రండిట్ నెహ్రూ ప్రపంచ ప్రజల అభిమానం చూడగొన్నరని అన్నారు. కార్యక్రమంలో పాల్గోన్నకవలు నల్లా నరసింహమూర్తి, బొంతు వీరవెంకట సత్యనారాయణ, బి.వి.సి ప్రొఫెసర్ డాక్టర్ శ్రీపాధ రామకృష్ణ, ఆకోండి కృష్ణ శాస్త్రి, సామాజిక వేత్త అంకెం రంగారావు, బి.సతీష్ వర్మలు నివాళుల అర్పించారు.

### సత్యదేవుని బంగారు ఆభరణములను బ్యాంకులో డిపాజిట్



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి బంగారు ఆభరణములను గోల్డ్ డిపాజిట్ స్కీమ్ నందు 11కేజీల 494 గ్రాములు బంగారంను ది.15-11-2018 (గురువారం) ఎస్బిఐ విశాఖపట్నం బ్యాంకు నందు పాజిట్ చేయడ మైనది. గతంలో కుడా 22-128-796 గ్రాముల బంగారం గోల్డ్ డిపాజిట్ నందు డిపాజిట్ చేయడం జరిగింది.

# అరకులోయని కరువు మండలంగా ప్రకటించాలి




అరకులోయ : మండల కేంద్రంలో గల తహశీల్దార్ కార్యలయంలో సి.పి.ఎమ్ నాయకులు, ఆయా పంట నష్టల గ్రామాల గిరిజనులతో పెద్ద ర్యాలీతో నిరసనలు తెలిపారు. అనంతరం మండలములో గల 14 పంచాయతీల లో వరి, సామ, రాజ్మా ఇతర పంటలు నష్టం జరిగింది. నష్టం జరిగిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని ఎలక్షన్ డి.టి కి సి.పి.ఎమ్ నాయకులు వినతిపత్రం ఇచారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన అన్నారు. ఈ ర్యాలీలో పొద్దు.బాలదేవ్, రామారావు, జీ.చిన్నబాబు, నానీబాబు, జగన్నాధం, రైతులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల సమస్యలపై సీఎంకు వినతిపత్రం సమర్పించిన

## ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ కుమార్



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ నిరుద్యోగుల సమస్యల మీద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ముఖ్యంగా ఎస్సై,కానిస్టేబుల్ కనీసం 10000, గ్రూప్2, గ్రూప్3 , జైలర్, డిప్యూటీ జైలర్, అగ్నిమాపక సిబ్బంది, వివిధ విద్యాసంస్థలలో ఖళీగా ఉన్న 2000 గ్రంధపాలకుల పోస్టులు , 20000 పోస్టులతో, వివిధ కాలేజీలలో ఖాళీగా ఉన్న జెఎల్, పోస్టులు,1995 నుండి ఖాళీగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్లు తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ముఖ్యంగా పశ్చిమగోదావరి జిల్లాలంటి చోట్ల ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా భర్తీకి నోచుకోలేదని వివరించారు. ముఖ్యంగా ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు మరో 3 సంవత్సరాల వయోపరిమితి పెంచాలని కోరారు. ఏపీపిఎస్‌సీ నిర్వహించే అన్ని పరీక్షలకు 44 సంవత్సరాలకు వయోపరిమితి పెంచాలని కోరారు. వయోపరిమితికి జూన్ 1 కటాఫ్ తేదీగా నిర్ణయించాలని కోరారు. అంతేకాక ముఖ్యంగా గ్రూప్2 లోని ఎగ్జిక్యూటివ్ పోస్టులను గ్రూప్1 లో విలీనం చేసే జివో నంబరు 622, 623 లను తక్షణమే రద్దు చేసి పాత పద్ధతిలోనే ఆబ్జెక్టివ్ తరహాలో పరీక్ష నిర్వహించాలని కోరారు. గ్రూప్2 పోస్టులు కనీసం 800 భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్, విశాఖ జిల్లా కన్వీనర్ సనపల తిరుపతి రావు,దంతేశ్వర్ పట్నాయక్,కండాపు చిన్నమనాయుడు, రామకృష్ణ,పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# సమస్యలపై అధికారులను నిలదీసిన గ్రామస్థులు

మాకవరపాలెం ; గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారదిశగా ఏర్పాటుచేసిన గ్రామదర్శిని కార్యక్రమంలో పేరుకుపోయిన సమస్యలపై అధికారులను గ్రామస్థులు నిలదీశారు. మాకవరపాలెం మండలం జమీందారి గంగవరంలో గురువారం గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో అధికారులు మాట్లాడుతుండగా వారి ప్రసంగానికి అడ్డుతగిలిన గ్రామస్థులు సమస్యల ఏకరువు పెట్టారు. గ్రామంలోంచి స్మశానంనకు వెళ్లే రహదారిలో తుప్పలు తొలగించలేదన్నారు. గ్రామంలో రహదారులు వేసినా కాలువలు లేవని దీంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వీధిదీపాలు సైతం నిత్యం వెలుగుతున్నా వాటిని పట్టించుకున్న పాపాన అధికారులు పోలేదని మండిపడ్డారు. దీనిపై త్వరగతిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల చిన్నయ్యమ్మ, ఎంపీడీవో ఎం.ఉదయశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుని తెప్పోత్సవం, గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై

## ఈవో జితేంద్ర సమీక్ష సమావేశం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు తరువాత అంతటి ప్రాముఖ్యత కలిగే స్వామివారి తెప్పోత్సవం ఈ నెల 20వ తేదీ క్షిరాబ్ది ద్వాదశి సాయంత్రం 6 గం.ల నుండి పంపా సరోవరంలో శ్రీ స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం జరుగుతుంది. కావున దీనిపై దేవస్థానం ఈవో ఎమ్.జితేంద్ర పంపారిజర్వాయర్ లో నీటి నిల్వలు పూర్తి స్దాయిలో తగ్గిపోవడంతో స్థానిక ఎమ్మెల్యే మరియు పుష్కర,ఏలేరు ఇరిగేషన్ వారితో సంప్రదించి పుష్కర కాలువ,ఏలేరు కాలువలు నుండి నీరు పూర్తి స్దాయిలో పంపా రిజర్వాయర్ లోకి ప్రవేశపెట్టి స్వామివారి తెప్పోత్సవానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.అలాగే కార్తీకమాసము రద్దీ దృష్ట్యా దేవస్థానంలో అప్పు టాయిలెట్లు ఓన్ జిసి వారి సహకారంతో బయో టాయిలెట్లు సుమారు రు.20 లక్షలు విలువలతో కూడిన టాయిలెట్లకు ఏర్పాటు చేసారజ.అలాగే స్వామివారి వ్రతాలకు అదనపి మండపాలు మరియు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మంచినీటి సౌకర్యం, ప్రతీ రోజు ఉదయం 8 గం.ల నుండి సాయంత్రం 3గం.ల వరకు పులిహోర,దద్దోజం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసారు.అదేవిధంగా 23వ తేదీ కార్తీక పౌర్ణమి శుక్రవారం ఉదయం 8గం.ల నుండి శ్రీ స్వామివారి గిరి ప్రదక్షిణ మహోత్సవం జరుగును.కావున రత్నగిరి చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం గిరి ప్రదక్షిణ భక్తి పాటలతో పాటు ధియేటర్ లలో సత్యదేవుని గిరి ప్రదక్షిణపై మూడు జిల్లాల ధియేటర్ లలో సత్యదేవుని గిరి ప్రదక్షిణ ప్రచార వీడియోను సినిమా ప్రారంభ సమయంతో పాటు విరామ సమయంలో ప్రచారం కల్పిస్తున్నామని అన్నారు.గిరి ప్రదక్షిణ జరిగే రోడ్డు విస్తీరణ పనులను ఇప్పటికే పిఆర్వో తులా.రాముడు దాతల సహకారముతో అనగా పోలవరం కాంట్రాక్టర్ సగితాల ఇన్ ఫ్రా ప్రాజెక్టు వారి సహకారంతో తీర్చిదిద్దారన్నారు.అదేవిధంగా పిఆర్వో తులా.రాముడు మాట్లాడుతూ భవిష్యత్తులో సత్యగిరి ప్రదక్షిణ రోడ్డును రాజకీయ నాయకులు,మరియు ఇతర ప్రాజెక్టు అధికారుల యొక్క దాతల సహకారంతో గిరి ప్రదక్షిణ మెటల్ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మిస్తామని తెలిపారు.అలాగే గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు,గ్రామస్థులకు ఎటువంటి ఇబ్బంది కలగ కుండా 22 స్టాల్స్ (మజ్జిగ, మంచినీరు వగైరా)మరియు 3చోట్ల మెడికల్ సెంటర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసి ఈరంకి.జగన్నాధరావు,పిఆర్వో తులా.రాముడు,సూపరింటెండెంట్ బలువు.సత్య శ్రీనివాస్, పొల్నాటి.లక్ష్మీనారాయణ,దేవస్థానం పాలక మండలి సభ్యులు కొత్త.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా నాటుసారా, బ్రాందీ అమ్మకాలు

యానాం: పట్టణ గ్రామీణ ప్రాంతాలలో విచ్చలవిడిగా నిషేధిత నాటుసారా, బ్రాంది అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. స్థానిక పైడికొండల వారి వీధిలో ఒక సంధులో ప్రభుత్వ ఆసుపత్రి వెనుకభాగంలో అక్రమ నాటుసారా, బ్రాందీ అమ్మకాలు జోరుగా కొనసాగిస్తున్నారు. పుదుచ్చేరి డిఐజి ఎస్ సుందరీనంద యానాం పర్యటన సందర్భంగా అమ్మకపుదారులు యదేచ్ఛగా కొనసాగించారు. వీటిని అరికట్టవలసిన రెవెన్యూ, ఎక్సైజ్ పోలీసు అధికారులు ముడుపుల మత్తులో పట్టించుకున్న దాకలాలు ఎక్కడా కనపడలేదు. ఈ అమ్మకాలు యదేచ్ఛగా ఏళ్ళ తరబడి కొనసాగడం విశేషం. ఎవరైనా ఎటువంటి వ్యాపార లావాదేవీలు జరిపినా మున్సిపాలిటీ నుండి అనుమతులు తీసుకోవలసి ఉంది అయితే ఇంత బాహాటంగా అమ్మకాలు కొనసాగుతున్నా ఎ ఒక్క అధికారి కూడా వాటిని అరికట్టే ప్రయత్నం చేయకపోవడం విశేషం. పరిపాలనాధికారి కార్యాలయానికి అతి సమీపంలోఉన్న ఈ అమ్మకాలను ఎందుకు అరికట్టడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మద్యం సేవించే స్వామీజీలు, బాటసారులు మద్యం ప్రియులు తాగిపడిపోతున్నా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. ఐలాండ్ భూములలోని సారాబట్టీలు ఏర్పాటుచేసుకుని అక్రమ నాటు సారా బట్టిల నుండి నది రోడ్డు మార్గాలగా మద్యం తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. సావిత్రినగర్‌లో స్థానిక అధికారలు, ప్రజా ప్రతినిధుల అండదండలతో ఒక కుటుంబం ఈ సారా అమ్మకాలు చేయడంపై ప్రజలు అధికారులకు ఫిర్యాదుచేసిన పట్టించుకొనే పరిస్థితులు దరిదాపుగా కనిపించడంలేదు. ఒక కుటీర పరిశ్రమలా ఈ వ్యాపారం కొనసాగుతుంది. గిరియంపేటలో సుమారు 14 గృహాలలో ఈ బ్రాంది. సారా అమ్మకాలు సాగుతున్నాయి. ఆ గ్రామల పరిసర ప్రాంతాలనుండి మద్యం ప్రియులు తరలివచ్చి సేవించి వెళ్ళడం పరిపాటిగా వస్తుంది. ఆ ప్రాంతాలలో విధులు నిర్వహించే పోలీసులు మామూలు వసూలుచేసుకొని వెళ్ళడం సాగుతుందని గ్రామస్తులు ఆరోపించారు. సీతారంనగర్, దొమ్మేటివారి పేట, పరంపేటలలో ఈ అమ్మకాల వ్యవహారం సాగుతుంది. యానాం దరియాల తిప్పలలలో పోలీసు స్టేషన్లు ఉన్నప్పటికీ ఇంత బాహటంగా అమ్మకాలు జరగడంపై అధికారుల తీరుపై ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ మద్యం అమ్మకాలలో అధికారులకు నెలకు లక్షలాది రూపాయలు మాములు చెల్లించి అమ్మకాలు సాగిస్తున్నారని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు బ్రాందీ లైసెన్సు వ్యాపారులనుండి గుట్టుచప్పుడుగా బ్రాంది కొనుగోలుచేసి గ్రామీణ ప్రాంతాలలో అమ్మకాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాన్ని అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని లేనియెడలా పుదుచ్చేరి విజిలెన్స్ కమిటీకి అధికారుల తీరుపై సాక్షాధారాలతో ఫిర్యాదుచేస్తామని పలువురు నాయకులు ఆరోపించారు.

# చిత్రభాను

## రజనీతో సినిమా నమ్మలేకపోతున్నా!



రజనీకాంత్ కథానాయకుడిగా కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతున్న తాజా తమిళ చిత్రం పేట్టా. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సిమ్రన్, త్రిష, విజయ్ సేతుపతితో పాటు బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్రలను పోషిస్తున్నారు. రజనీకాంత్, సిమ్రన్‌లతో కూడిన కొత్త పోస్టర్‌ను చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ బుధవారం ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకుంది. ఇందులో ఎరుపు రంగు జాకెట్, మెడలో కండువా ధరించి చేతిలో పూల కుండీతో ట్కస్టైలిష్‌లుక్‌లో కనిపిస్తున్నారు రజనీకాంత్.

పసుపువర్ణ దుస్తుల్లో సిమ్రన్ చిరునవ్వులు చిందిస్తూ దర్శనమిచ్చారు. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్రబ ృందం ప్రకటించింది. రజనీకాంత్‌తో సినిమా చేశానంటే నమ్మలేకపోతున్నా. చాలా సంతోషంగా ఉంది అంటూ ఈ పోస్టర్‌ను ఉద్దేశించి సిమ్రన్ వ్యాఖ్యానించింది. కబాలి, కాలా చిత్రాల్లో వయసు మళ్లిన పాత్రల్లో కనిపించిన రజనీకాంత్ ఇందులో ఆధునిక ఛాయలతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. హాస్టల్ వార్డెన్‌గా, సైనిక అధికారిగా భిన్న పార్శ్వాల్లో ఆయన పాత్ర సాగనున్నట్లు తెలిసింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది.

రజనీకాంత్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 2.ఓ చిత్రం ఈ నెల 29న విడుదలకానుంది. సైన్స్ ఫిక్షన్ కథాంశంతో దాదాపు 500 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రం రూపొందడం గమనార్హం.

## ప్రాణాలతో చెలగాటం



ప్రశాంత్, అవంతిక జంటగా నటిస్తున్న చిత్రం ప్రాణం ఖరీదు. పి.ఎల్.కె.రెడ్డి దర్శకుడు. నల్లమోపు సుబ్బారెడ్డి నిర్మాత. నందమూరి తారకరత్న కీలక పాత్రను పోషిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాతలు మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. లక్ష్యసాధనలో ప్రాణాలకు తెగించి ఓ యువకుడు ఎలాంటి పోరాటం చేశాడన్నది ఆకట్టుకుంటుంది. అమెరికాలో ఎనిమిది రోజులు, హైదరాబాద్‌లో 45 రోజులు చిత్రీకరణ జరిపాం. త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం అని తెలిపారు. వాణిజ్య హంగులతో కూడిన ప్రేమకథా చిత్రమిది. ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో సాగుతూ థ్రిల్‌ను కలిగిస్తుంది. ప్రశాంత్, నందమూరి తారకరత్న పాత్రలు, వందేమాతరం శ్రీనివాస్ సంగీతం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి అని దర్శకుడు చెప్పారు. షఫీ, జెమిని సురేష్, చిత్రం శ్రీను ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: మురళీమోహన్‌రెడ్డి, మాటలు: మారుధూరి రాజా.

## రాజమౌళి మల్టీస్టారర్‌లో..



మహానటి చిత్రంలో సావిత్రి పాత్రలో అసమాన అభినయంతో తెలుగు ప్రేక్షకుల హ ృదయాల్ని గెలుచుకున్నది కీర్తిసురేష్. ఆమె కెరీర్‌లో మరపురాని విజయంగా ఈ చిత్రం నిలిచింది మహానటి తర్వాత తెలుగులో పలు అవకాశాలు వరించినా ఏ సినిమాను అంగీకరించలేదు ఈ సొగసరి.

నటనకు ఆస్కారమున్న పాత్రలపై ద ృష్టిసారించిన ఆమె రాజమౌళి మల్టీస్టారర్ చిత్రంలో కథానాయికగా నటించనున్నట్లు తెలిసింది. రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా ఎస్.ఎస్.రాజమౌళి ఓ భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే లాంఛనంగా ఈ చిత్రం ప్రారంభమైంది. ఇందులో ఓ కథానాయికగా కీర్తిసురేష్‌ను తీసుకోవాలనే యోచనలో దర్శకుడు రాజమౌళి ఉన్నట్లు సమాచారం. మరో హీరోయిన్‌గా కైరా అద్వానీ నటించనున్నట్లు తెలిసింది.

## రెచ్చిపోయిన బోల్డ్ బ్యూటీ..



తరచుగా వివాదాల్లో చిక్కుకుని నిత్యం వార్తల్లో కనిపించే హీరోయిన్ రాధికా ఆప్టే. ఎలాంటి విషయం గురించి అయినా ధైర్యంగా మాట్లాడేసి రాధికా.. అందాలు కూడా అదేస్థాయిలో ఆరబోస్తూ బోల్డ్ బ్యూటీగా గుర్తింపు పొందింది. చిరవరకు రాధికా ఆప్టే శ ృంగార ప్రాధాన్యం ఉన్న చిత్రాల్లో కూడా నటించి ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం నెట్ ఫ్లిక్స్ తో బిజీగా గడుపుతోంది. అప్పుడప్పుడూ సోషల్ మీడియాలో ఘాటు అందాల ఫోటో షూట్స్ తో కుర్రకారు మతి పోగొడుతూ ఉంటుంది. ఇటీవల రాధికా ఆప్టే మాక్సిం మ్యాగజైన్ కు ఫోటో షూట్ చేసింది. ఈ ఫోటో షూట్ లో రాధికా ధరించిన కాస్ట్యూమ్స్ అందాల ఆరబోత చూస్తే కుర్రాళ్లకు పిచ్చెక్కిపోవలసిందే. అందాలు ఆరబోయడం తనకు వెన్నతో పెట్టిన విద్య అన్నట్లుగా రాధికా ఘాటు ఫోజులతో చెలరేగిపోయింది. రాధికా ఆప్టే తరచుగా వివాదాస్పద కామెంట్స్ చేస్తూ వివాదాలలో చిక్కుకుంటూ ఉంటుంది. ఆ మధ్యన టాలీవుడ్ లో కాస్టింగ్ కౌచ్ ఎక్కువ అంటూ రాధికా ఘాటు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తెలుగులో బాలయ్య సరసన లయన్ చిత్రంలో రాధికా చివరగా కనిపించింది. రక్తచరిత్ర, లెజెండ్ లాంటి విజయాలు ఈ అమ్మడి ఖాతాలో ఉన్నాయి. రాధికా ఆప్టే ప్రస్తుతం పలు టెలివిజన్ సిరీస్ లలో నటిస్తోంది. బాలీవుడ్ లో అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. టాలీవుడ్ లో మంచి అవకాశాలు అందుకుంటున్న సమయంలో రాధికా బాలీవుడ్ కు వెళ్ళిపోయింది. ఆ తరువాత శ ృంగార ప్రాధాన్యత ఉన్న చిత్రాల్లో నటించడం లాంటి వివాదాలతో అమ్మడి ఇమేజ్ డ్యామేజ్ అయింది. రాధికా ఆప్టే పలు ఇంగ్లీష్ చిత్రాల్లో కూడా కీలక పాత్రలో నటిస్తోంది. బాలీవడ్ లో అరాకొరా అవకాశాలు దక్కుతున్నా కెరీర్ పుంజుకునే విజయం మాత్రం దక్కడం లేదు. ప్రస్తుతం మాక్సిం మ్యాగజైన్ కు రాధికా చేసిన ఫోటో షూట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## స్వచ్ఛమైన ప్రేమకథ



మా మామయ్య డి.వి.ఎస్ రాజు చక్కటి సినిమాల్ని నిర్మించడమే కాకుండా ఎంతో మంది ప్రతిభావంతులైన కళాకారులను చిత్రసీమకు పరిచయం చేశారు.

ఆయన స్ఫూర్తితో అనగనగా ఓ ప్రేమకథ చిత్రాన్ని కొత్తవారితో రూపొందించాను అని తెలిపారు కె.ఎల్.ఎన్.రాజు. థౌజండ్ లైట్స్ మీడియా పతాకంపై ఆయన నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రతాప్ తాతంశెట్టి దర్శకుడు. విరాజ్.జె. అశ్విన్, రిద్ధికుమార్, రాధాబంగారు నాయకానాయికలుగా నటిస్తున్నారు. డిసెంబర్ 2వ వారంలోవిడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ చాలా కాలం తర్వాత ఓ మంచి సినిమాను నిర్మించాలనే ఆలోచనతో పలు కథలు విన్నాను. దర్శకుడు ప్రతాప్ చెప్పిన ఈ కథ నన్ను ఆకట్టుకుంటుంది. ఈ సినిమా ద్వారా హీరోహీరోయిన్లు, దర్శకుడు ప్రతాప్, సంగీత దర్శకుడు కె.సి.అంజన్‌లతో పాటు పలువురు నటీనటులు, సాంకేతిక నిపుణుల్ని పరిచయం చేస్తున్నాను. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యు సర్టిఫికెట్ లభించింది అని తెలిపారు. స్వచ్ఛమైన ప్రేమకు నిదర్శనంగా నిలిచే చిత్రమిదని, హైదరాబాద్, అరకు, మలేషియా, లంకావిలోని అందమైన లొకేషన్స్‌లో సినిమాను చిత్రీకరించామని, ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రం, పాటలకు మంచి స్పందన లభిస్తున్నదని దర్శకుడు చెప్పారు. కాశీవిశ్వనాథ్, అనీష్ కురువిళ్ళ, వేణు టిల్లు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా : ఎదురొలు రాజు.

## వాళ్ల భయం నిజమే!



రంగులో నేను లారాగా నటించాను. ఈ విషయంలో లారా కుటుంబ సభ్యుల భయం నిజమే. సమాజంలో ఒక మనిషి ఎలా వుండాలో ఎలా వుండకూడదో చెప్పే సినిమా ఇది. లారా ఐడియాలజీ, ఆలోచనా విధానం అంతా సినిమాలో చూపించాం. సినిమా చూస్తే లారా కుటుంబ సభ్యుల కళ్లల్లో నీళ్లు తిరుగుతాయి అన్నారు తనీష్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రంగు. కార్తికేయ దర్శకుడు. పద్మనాభరెడ్డి, నల్ల అయ్యన్న నాయుడు ఈ చిత్రాన్ని నిర్మించారు. విజయవాడకు చెందిన లారా అలియాస్ పవన్‌కుమార్ కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారని లారా కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వారి అనుమానాల్ని నివ ృత్తి చేస్తూ చిత్ర బ ృందం బుధవారం హైదరాబాద్‌లో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. దర్శకుడు మాట్లాడుతూ లారా కుటుంబాన్ని కించపరుస్తూ సినిమా తీయాలనే ఉద్దేశం మాకు లేదు. కుటుంబ సభ్యులు మా సినిమా చూస్తే లారా ఇంకా తమ మధ్యే తిరుగుతున్నాడని ఫీలవుతారు అన్నారు.

# విశాఖలో 50 ఎకరాల్లో ఇంటెలిజెంట్ గ్లోబల్ హబ్

- 50 ఎకరాలు కేటాయించేందుకు తదుపరి క్యాబినెట్‌లో ఆమోదం
- ప్రపంచంలో అత్యుత్తమ డిజిటల్ లెర్నింగ్ గేమింగ్ డిజైన్ సంస్థలకు హబ్
- 700 మిలియన్ డాలర్ల పెట్టుబడితో 5 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- ఆన్ సేవల ద్వారా అవినీతి రహిత రాష్ట్రంగా ప్రథమ స్థానంలో ఆంధ్రప్రదేశ్
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



విశాఖపట్నం : యునెస్కో సహకారంతో విశాఖలో 50 ఎకరాల్లో ఇంటెలిజెంట్ గ్లోబల్ హబ్ (ఐ-హబ్)ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇందుకు వచ్చే క్యాబినెట్‌లో 50 ఎకరాల భూమిని కేటాయిం చేందుకు ఆమోదం తెలుపుతా మన్నారు. యునెస్కో - ఎంజిఐఇపి రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా విశాఖ నగరంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న టెక్-2018 సదస్సును గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ లెర్నింగ్ అనేది పనిష్మెంట్ కాకూడదని, ఫన్‌గా ఉండాలన్నారు.

ఈ గ్లోబల్ హబ్ ద్వారా 5 వేల ఉద్యోగ అవకాశాలు కలుగుతున్నాయని ఆయన తెలిపారు. వైజాగ్ డిక్లరేషన్ ఆన్ డిజిటల్ కంటెంట్‌ను యునెస్కో అడాప్ట్ చేసుకునేలా యునెస్కో వర్ల్డ్ కాన్ఫరెన్స్‌లో ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి తెలిపారు. డిజిటల్ సర్వీసులు, ఫైబర్ గ్రిడ్ ద్వారా ప్రతీ ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్‌ను ఇస్తున్నామన్నారు. దేశంలో తొలిసారిగా వర్చువల్ క్లాస్‌లు ఏర్పాటు చేసిన ఘనత ఏపీకే దక్కుతుందన్నారు. ఏపీని వచ్చే సంవత్సరానికి అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. దేశంలో వ్యవసాయరంగ అభివృద్ధికి సేంద్రీయ ఎరువులతో సాగుకు ప్రోత్సహిస్తామన్నారు.

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జావేద్కర్ వీడియో సందేశం ద్వారా మాట్లాడుతూ క్లాసురూములలో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని, నూతన జాతీయ విధానాన్ని సిద్ధం చేశామని అన్నారు.

రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని విద్య, విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి గట్టి కృషి చేస్తున్నారన్నారు. డిజిటల్ లెర్నింగ్ గేమ్స్, పెడగోగీస్‌ను విస్తృత స్థాయిలో రాష్ట్రంలో అమలులోకి తెచ్చేందుకు తీవ్ర కృషి జరుగుతోందన్నారు.

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి ఎన్. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వైజాగ్ డిక్లరేషన్‌తో రాష్ట్రం ఎంతో పురోగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

యునెస్కో - ఎంజిఐఇపి తరపున కిర్గిస్తాన్ మాజీ అధ్యక్షురాలు రోజా ఒతుబుయేవి ప్రారంబోత్సవ ఉపన్యాయం చేయగా, యునెస్కో డైరెక్టర్ జనరల్ ఆ సందేశాన్ని చదివి వినిపిం చారు. ఈ సమావేశంలో గేమ్స్ ఫర్ సస్టైనబుల్ డవలప్‌మెంట్ హేకథాన్ ఛాలెంజ్ విన్నర్లను ప్రకటించి సీఎం బహుమతులను అందజేశారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు హెూం శాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, రాష్ట్ర విద్యా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాధ్ దాసు, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పెద్దిపాలెం విలేజ్‌లో రెండో రోజు కొనసాగిన దాడులు

**మిల్లులో పెద్ద ఎత్తున పిడిఎస్ బియ్యం నిల్వలను గుర్తించిన అధికారులు ....**
**37 లక్షల విలువగల 142 టన్నుల పిడిఎస్ బియ్యం స్వాధీనం......**
**మిల్లు యజమానురాలితో పాటుగా ఐదుగురు ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేసిన విజిలెన్స్ అధికారులు ....**



విశాఖపట్నం : అనందపురం పెద్ది పాలెం విలేజ్ లో శ్రీ సాయి బాలజీ మోడ్రన్ రైస్ మిల్లు పై వరసగా రెండవ రోజు విజిలెన్స్ అదికారులు దాడులు నిర్వహించారు. ఈమేరకు గురువారం నిర్వహించిన దాడుల్లో అనధికారికంగా 142 నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని అదికారులు స్వాదీనం చేసుకున్నారు . ఇందుకు సంబందించి విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ ఎస్పి డి.కొటేశ్వరావు వివరాలు వెల్లడించారు. అనందపురం మండలం పెద్ది పాలెం విలేజ్ లో శ్రీ సాయి బాలజీ మోడ్రన్ రైస్ మిల్ నిర్వహకురాలు జిల్లాలో కొంతమంది ప్రభుత్వ చౌక దుకాణాల్లో ప్రభుత్వం పేద ప్రజలకు సరపర చేస్తున్న పిడిఎస్ బియ్యాన్ని కొంత మంది దళారుల ద్వరా సేకరించి బియ్యాన్ని మిల్ లో పాలిషింగ్ చేసి బయట మర్కెట్ లో విక్రయిస్తునారన్న సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డి.జి గౌతం సవంగ్ అదేశాల మేరకు దాడులు నిర్వహించమన్నారు.

బ్రాండ్ పేర్లు మార్చి పాలిషింగ్ చేసిన బియ్యాన్ని బహిరంగ మర్కెట్ లో కిలో 30 నుండి 35 రూపాయలకు విక్రయిస్తున్నట్లు గుర్తించమన్నారు. అదేవిదంగా సి.ఎం.ఆర్ (కస్టమర్ మిలింగ్) నిమిత్తం ప్రభుత్వం అందించే ధాన్యాన్ని మిలింగ్ చెయ్యకుండా అధాన్యాన్ని పక్క దారి పట్టించి వాటి స్థానంలో తిరిగి రిసైగ్లింగ్ చేసిన బియాన్ని తిరిగి ప్రభుత్వ చౌక దుకాణాలకు అందిస్తునట్లు తమ దర్యాప్తులో తెలిందన్నారు .

ఇప్పటి వరకు నిర్వహించిన దాడుల్లో 37 లక్షల విలువగల 142 టన్నుల పిడిఎస్ బియ్యం స్వాదీనం చేసుకున్నమని బియాన్ని తరలిస్తున్న 5 ఆటోలు సీజ్ చేసామని వివరించారు . మిల్ నిర్వాహకురాలు చెన్నా శ్రావణి తో పాటుగా ఆటో డ్రైవర్లు కె.అప్పలస్వామి, ఎ.పాపినాయుడు, యు.సాయికుమార్, ఆర్.కణకరాజు, జి.కణకరాజు ల పై కేసు నమోదు చేశారు. నిర్వహించిన దాడుల్లో పట్టుబడ్డ పిడిఎస్ బియ్యం విలువ 37 లక్షల కు మించినందున కేసు నమోదు చేసిన వారిని జిల్లా కలెక్టర్ కోర్టులో హజరు పరుస్తామని అదే విదంగా ప్రభుత్వం సరపర చేస్తున్న పిడిఎస్ బియాన్ని అనధికారికంగా తరలిస్తున్న ఆటోల పర్మెట్ రద్దు అలాగే డ్రైవర్ల లైసెన్స్ రద్దు కు సిపారీస్ చేస్తామని తెలియజేశారు.

ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న నిత్యవసర వస్తువును పక్క దారి పట్టిస్తున్నట్లు గుర్తిస్తే అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు .దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డిఎస్పి పి.ఎం నాయుడు , సి .ఐ లు పి.మల్లికార్జునరావు, ఎన్.శ్రీనివాసరావు , తహశీల్దార్ సుమబాల , సి.ఎస్ .డి.టి కే. జయ, ఎ .ఎస్.ఓ మదుసూధనరావు సిబ్బంది పాల్గున్నారు.



# ఫుట్‌బాల్ క్రీడాకారులు అభివృద్ధి చెందాలి

- కొండా రాజీవ్ గాంధీ



విశాఖపట్నం : ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో విశాఖ సిటీ పోలీస్ మరియు హోమ్ గార్డ్ ఫుట్ బాల్ టీం ఆధ్వర్యంలో ప్రతిషాత్మకంగా నిర్వహిస్తున్న శ్రీ డీవీ రెడ్డి ఫుట్ బాల్ టోర్నమెంట్ కి రెండవరోజు ముఖ్య అతిధిగా పాల్గొన్న వైస్సార్సీపీ యువజన అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ, ఫుట్ బాల్ మ్యాచ్ ని ప్రారభించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు క్రీడాకారుల నుండి గౌరవ స్వాగతం అందుకున్న కొండా రాజీవ్ గాంధీ క్రీడాకారులని పరిచయం చేసుకుంటూ ముందుకి సాగారు. ఈ సందర్భంగా కొండా రాజీవ్ గాంధీ మాట్లాడుతూ విశాఖలో ఫుట్ బాల్ క్రీడాకారులు మరింత అభివృద్ధిలోకి రావాలనీ ఆకాంక్షించారు. భవిష్యత్తులో జగన్ అన్న సారధ్యంలో రాబోవు ప్రజా ప్రభుత్వంలో ఫుట్ బాల్ క్రీడాకారులను అన్నివిధాలుగా ఆదుకుంటూ ప్రోత్సహిస్తామని, అలాగే ఇందిరా ప్రియాదర్శిని మున్సిపల్ స్టేడియంకి మళ్ళీ అంతర్జాతీయ స్టేడియంలాంటి మహర్దశను తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివి రెడ్డి , రాంబాబు, పోలీస్ బాబూ, స్టార్ ఫ్లెక్స్ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

**LOANS / లోన్స్**
**HAPPY HOMES**
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
**94902 33750**

# చిప్పాడ (భీమిలి)లో
# 75వ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన శ్రీభరత్



విశాఖపట్నం : ఎమ్.పి.ఎమ్. ట్రస్టు ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టుతో కలసి నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిభిరాలుకు విశేష స్పంధన లభిస్తోంది. ఇప్పటి వరుకు 75 వైద్య శిభిరాలు నిర్వహించగా దాదాపు లక్ష మందికి పైగా ప్రజలు వీటికి హజరయ్యారు. గురువారం చిప్పాడ (భిమిలి)లో ఉచిత వైద్య శిబిరాన్ని స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్ మూర్తి గారి మనవడు ఎమ్.శ్రీభరత్ ప్రారంభించారు. స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి ఉచిత వైద్య శిభిరం కోసం ప్రత్యేకంగా శ్రద్ద తీసుకొన్నారని ఆయన నిర్దేశించిన విధంగా వైద్య శిభిరాలను కొనసాగిస్తామన్నారు. ఈ వైద్య శిభిరాల ద్వారా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వీలు కలుగుతుందని, సకాలంలో వైద్యం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.అనంతరం స్థానికంగా ఉన్న గ్రామ పెద్దలను కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకొన్నారు.

కలుషిత వాతావరణం కారణంగా కంటి సమస్యలతో పాటు వివిధ రకాల రోగాలతో సతమతమవుతున్న స్థానికులుకు ఉచితంగా వైద్య సేవలు పొందాలన్నారు.ఈ శిభిరంలో మూత్రపిండాల సమస్యలు, స్త్రీలసమస్యలు, క్షయ, మోకాళ్ళలో ఆరుగుదల, గుండె జబ్బులకు, పరీక్షలు జరిపారు. చిప్పాడలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిభిరం ద్వారా స్థానికలలో ఆధికశాతం కంటి సమస్యలు, వినికిడి, కీళ్ళ సమస్యలతో బాధ పడుతున్నాట్లు వైద్యలు గుర్తించారు.

గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి, జిమ్‌సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు, పెద్ద ఎత్తున సిబ్బంది వైద్య శిభిరాలలో పాల్గొన్నారు. కాగా గురువారం 220 మందికి దంత పరీక్షలు, 200 మందికి కంటి వైద్య పరీక్షలు, 250 మంరికి స్త్రీ సంబంధిత పరీక్షలు, 200 మందికి సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయుకులు సరగడం అప్పారావు, ట్రస్ట్ నిర్వాహకులు ఆళ్ళ శ్రీనివాసు, పి.వి.రామారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com